



# విజయభాను






విజయవాడ, గురువారం 05-10-2017 | VIJAYABHANU DAILY VIJAYAWADA EDITION | సంపుటి : 10 సంచిక : 122 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### దేశాభివృద్ధిలో
## ఉపగ్రహాలదే కీలకపాత్ర




- సామాన్యుడికి అందుబాటులో అంతరిక్ష సేవలు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభంలో
- ఉప-రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

న్యూఢిల్లీ : ఉప-రాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత నెల్లూరు జిల్లాలో వెంకయ్యనాయుడు తొలిసారిగా పర్యటిస్తున్నారు. బుధవారం శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రంలో పర్యటించిన ఆయన ఎంఆర్ కురూప్ ఆడిటోరియంలో ప్రపంచ అంతరిక్ష తరువాయి 2లో

### అన్ని జిల్లాల్లో పర్యటించి
## నివేదిక అందజేస్తాం

### గిరిజనులకు అన్యాయం జరగదు
### ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ



గుంటూరు: వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చాలన్న అంశంపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ గుంటూరులోని జిల్లాపరిషత్తు సమావేశ మందిరంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. గిరిజన, ఆదివాసీ సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి అభిప్రాయాలను వెల్లడించి వినతి పత్రాలను కమిషన్‌కు అందజేశారు. వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చాలనే డిమాండ్‌పై ఎస్సీ, ఎస్టీ కమిషన్ సామాజిక, ఆర్థిక, సంస్కృతులను క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వానికి నివేదిక అందించనుందని కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ పేర్కొన్నారు. అభిప్రాయ సేకరణ అనంతరం విలేకరులతో మాట్లాడారు. సత్యపాల్ కమిటీ ఇప్పటికే ప్రభుత్వానికి అధ్యయనం చేసిన నివేదికను అందజేసిందని, కమిషన్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించి అధ్యయన నివేదికను అందజేస్తామన్నారు. ఇప్పటికే కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పర్యటించి నివేదికను రూపొందించామని, మిగిలిన జిల్లాలను త్వరలో పర్యటించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు. అధ్యయనం, నివేదిక తర్వాత కేంద్ర సామాజిక న్యాయశాఖ, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ తుదిగా పార్లమెంట్ దీనిపై నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. గిరిజనులకు అన్యాయం జరగకుండా కమిషన్ అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటుందని, గిరిజనులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు ఎన్.సుధారాణి, రవీంద్ర, వర్రప్రసాద్, రాజారావు, జేసీ క్రితికా శుక్ల, సోషల్ వెల్ఫేర్ జేడీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గిరిజనులకే సక్రమంగా అందటం లేదని, ఈ క్రమంలో వాల్మీకి, బోయలను తరువాయి 2లో

## ప్రజాస్వామ్యంలో రాజకీయ హింసకు తావులేదు



న్యూఢిల్లీః ప్రజాస్వామ్యంలో రాజకీయ హింసకు తావులేదని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. కానీ, దురదృష్టవశాత్తు కేరళలో ఇది రాజకీయ హత్యాకాండలకు దారితీస్తుందని ఆరోపించారు. కేరళలో బీజేపీ కార్యకర్తలపై దాడులకు వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీలో పాల్గొని యోగి ప్రసంగించారు. బీజేపీ కేరళ రాష్ట్ర శాఖ అధ్యక్షుడి కుమానమ్ రాజశేఖరన్‌తో కలిసి ఏడు కిలోమీటర్ల మేర సాగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ యాత్రతో సిపిఐ (ఎం) దుష్టపాలన గురించి ప్రజల్లో చైతన్యం వచ్చిందని, మద్దతుగా భారీ సంఖ్యలో బయటికి వస్తున్నారని యోగి అన్నారు. బీజేపీ కార్యకర్తల హత్యలను తరువాయి 2లో

## ఇష్టపడి పని చేస్తేనే ప్రజాదరణ

అనంతపురం : అందరూ బీటెక్ పూర్తి చేయగానే ఉద్యోగం వచ్చింది. చాలా సంతోషం. ప్రభుత్వం ఎక్కడ పోస్టింగ్ ఇస్తే అక్కడే ఇష్టపడి పని చేయండి. మీరందరూ యువకులు. ఈ వయసులో బాగా కష్టపడాలి. అన్ని అంశాలపై పట్టు సాధించాలి. అపుడే పాలనపై సమగ్ర అవగాహన వస్తుంది. కష్టపడకుండా జీతం కోసం పని చేస్తామంటే కుదరదు. ఏఈఈగా ఉన్నపుడే అన్నింటిలోనూ రాటుతేలాలి. తెలీని విషయాలను అడిగి తెలుసుకోవాలి...అని హెచ్చెల్సీ ఎస్ఈ టీవీ శేషగిరిరావు పేర్కొన్నారు. తన కార్యాలయంలో యువ జేఈఈలకు ఈ జిల్లా నీటి వనరులపై తగిన అవగాహన కల్పించారు. ఎస్ఈ మాట్లాడుతూ, మీరందరూ ఎన్నో జిల్లాల్లో తిరిగారు. వాటితో పోలిస్తే ఇక్కడి ప్రజలకు నీటి విలువ బాగా తెలుసు. ఎందుకంటే.. ఇక్కడ సాధారణ వర్షపాతమే నమోదు కాదు. తాగునీటికే కొరత ఉంటుంది. ఈ ప్రాంత జనానికి నీటి విలువ, పొదుపు రెండూ తెలుసు. తక్కువ నీటితోనే పంటల సాగు చేసి విజయం సాధిస్తున్నారు. కోస్తాంధ్రతో పోలిస్తే భిన్నమైన వాతావరణం ఉంటుందన్నారు. ఈఈ (లోకో) వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ, పోలవరం, పట్టిసీమ వంటి ప్రాజెక్టులపై అవగాహన పెంచుకున్నారు. క్యూసెక్కులు అంటే ఏమిటీ, టీఎంసీలు, ఒక్కో పంపు తరువాయి 2లో

## నోట్ల రద్దు అర్థం లేని చర్య

### మాజీ మంత్రి అరుణ్ శౌరీ



న్యూఢిల్లీః నోట్ల రద్దు వ్యవహారంపై ఇప్పటికే కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా హాట్ కామెంట్స్ చేయగా, తాజాగా ఈ జాబితాలో మరో మాజీ మంత్రి కూడా చేరారు. ఇదివరకటి ఎన్డీయే హయాంలో కేంద్రమంత్రిగా వ్యవహరించిన అరుణ్ శౌరి తాజాగా నోట్ల రద్దు అంశంపై ఘాటుగా స్పందించారు. అదొక అర్థం లేని చర్య అని శౌరి వ్యాఖ్యానించారు. ఒక టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోడీ ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. ఈ బీజేపీ మాజీ నేత. నోట్ల రద్దుతో దేశ ఆర్థిక వ్యవస్థ మందగించిందని శౌరి అన్నారు. గతంలో ఈయన ప్రపంచ బ్యాంకులో పని చేశారు. ఆర్థిక వేత్తగా ప్రసిద్ధి చెందిన వ్యక్తి ఈయన. ప్లానింగ్ కమిషన్‌కు తరువాయి 2లో

### దేశం పట్ల బాధ్యతతో వ్యవహరించటమే
## గాంధీ ధర్మం

### గీతం 'వర్సిటీలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్



సాగర్‌నగర్ః దేశం పట్ల, సమాజం పట్ల ప్రజలు బాధ్యతతో వ్యవహరించటమే గాంధి ధర్మాన్ని ఆచరించటం కింద వస్తుందని ముఖ్యంగా మాతృభూమిని, మాతృభాషను, దేశ సంస్కృతి మూలాలను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపైన ఉందని అదే గాంధి మార్గం కూడా అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్‌రావు పేర్కొన్నారు. గీతం తరువాయి 2లో

## ఉపాధ్యాయుల హాజరే ఉత్తీర్ణతలో కీలకం

అనంతపురం : ఉపాధ్యాయులు కచ్చితంగా పాఠశాలకు హాజరైతే విద్యార్థుల ఉత్తీర్ణతలో సైతం వ్యత్యాసం ఉంటుందని డీఈవో లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పదో తరగతి బోధించే ఉపాధ్యాయులు ఏమేరకు హాజరు అవుతున్నారు. గత విద్యాసంవత్సరంలో ఎన్ని సెలవులు తీసుకున్నారో ఉపాధ్యాయుల వారీగా వివరాలు సేకరించాల్సి ఉందన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని వివరాలను సేకరిస్తే కలెక్టరు ఉపాధ్యాయులతో ఓసారి సమీక్ష నిర్వహిస్తారన్నారు. ప్రధానంగా ఉపాధ్యాయుల హాజరే సంబంధిత సబ్జెక్టులో వంద శాతం ఉత్తీర్ణత రావడానికి ఉపకరిస్తుందన్నారు. ఉపవిద్యాశాఖాధికారులు నెలలో ఏయే పాఠశాలలను ఎన్ని సార్లు తనిఖీలు చేశారో వివరాలు క్రోడీకరించాలన్నారు. జిల్లాలో 2,562 బయోమెట్రిక్ మిషన్లు సరఫరా చేయగా అందులో 1,000 మిషన్లను మరమ్మతు చేశామని సంబంధిత సంస్థ వారు చెబుతున్నారనీ.. అయితే పాత వాటిని తీసుకొని కొత్తవి సరఫరా చేయాల్సి ఉందన్నారు. కొందరు ఉపాధ్యాయులు సంఘాల పేరుతో పాఠశాలకు డుమ్మా కొడితే ఉపేక్షించమని డీఈవో హెచ్చరించారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనరు గోవిందనాయక్, ఉపవిద్యాధికారులు ఉమామహేశ్వర్, మల్లికార్జునప్ప తదితరులు పాల్గొన్నారు.

### టేకిట్ ఈజీ




మళ్ళీ మీ అభిమాన హీరో దగ్గరకి వెళ్ళొచ్చినట్టున్నావ్... !?

### మారకపోతే..
## మారిపోతారు

- ఇంటింటికీ తెలుగుదేశంపై చర్చ
- పలు నియోజక వర్గాల్లో పనితీరుపై అసంతృప్తి
- నేతలకు సీఎం బాబు హెచ్చరిక






అమరావతి : ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం సక్రమంగా జరగని నియోజకవర్గంలో కొత్త నాయకత్వాన్ని చూస్తారంటూ ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు నేతలను గట్టిగా హెచ్చరించారు. తన నివాసం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమం అమలవుతున్న తీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా నేతలతో చర్చించారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపైనా ఇందులో ప్రధానంగా చర్చ తరువాయి 2లో




# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలే



కర్నూలు : కుడా పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా జరిగే నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఆ సంస్థ ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కర్నూలు చాణక్యపురి కాలనీలోని కుడా కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గతంలో ఏమైనా తప్పులు జరిగి ఉంటే వాటిని సరిదిద్దుకోవాలని, నిర్మాణదారులు, వ్యాపారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు. వాణిజ్య సము దాయాల్లోని పార్కింగ్ ప్రదేశాల్లో దుకాణాలు నిర్వహిస్తున్నారని, వీటిని తక్షణమే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనదారులు రహదారులకు అడ్డంగా పెడుతూ ప్రజా జీవనానికి విఘాతం కలిగిస్తున్నారని చెప్పారు. ఇకనైనా సంబంధిత యజమానులు తమ సముదాయాల్లో పార్కింగ్ స్థలాన్ని తప్పనిసరిగా చూపించాలని కోరారు. ఇప్పటికే నగరంలోని దుకాణ సముదాయాల్లో పార్కింగ్ స్థలాల కేటాయింపుపై నగరపాలక, పోలీసు అధికారులతో తనిఖీలు చేయించామని, మరో 10 రోజుల్లో బాధ్యులైన యజమానులు స్పందించకుంటే తీవ్ర చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అక్రమ లేఅవుట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించమని, కొనుగోలుదారులు సైతం వీటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సంచాలకులు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్ఎన్ఎల్‌లో సరికొత్త పథకాలు

కర్నూలు : అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా బీఎస్ఎన్ఎల్ కొత్త పథకాలను ప్రవేశపెట్టినట్లు బీఎస్ఎన్ఎల్ జీఎం పీఎస్ జాన్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సంస్థ 18వ ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా 7వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎల్ఎఫ్ఎంటీ, అసీం, ఎంఎంపీసీ, బీపీసీ వంటి కొత్త పథకాలను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఎల్ఎఫ్ఎంటీ పథకం ద్వారా ల్యాండ్‌లైన్‌కు వచ్చిన ఫోన్ కాల్స్‌ను మొబైల్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చున్నారు. అసీం పథకం ద్వారా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు రూ.99, ఇతర నెట్‌వర్క్ దారులు రూ.199 చెల్లించి ఏడాది వరకు సేవలు పొందవచ్చన్నారు. ఎంఎంపీసీ పథకం ద్వారా ఒకేసారి 30 మందితో మాట్లాడొచ్చని, బీపీసీ పథకం ద్వారా ఇతర కేంద్రాలకు ఉచితంగా ఫోన్ కాల్స్ చేయొచ్చన్నారు. 6న డివిజన్‌స్థాయిలో వినియోగదారుల సమావేశం నిర్వహించి ఎక్కువకాలంగా బీఎస్ఎన్ఎల్ వాడుతున్నవారిని సన్మానిస్తున్నట్లు చెప్పారు. 7వ తేదీన వినియోగ దారుల ప్రోత్సాహ కార్యక్రమం నిర్వహించి పలు అంశాలను తెరపై చూపిస్తామన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# గూడు కోసం సంతకాల సేకరణ



బెంగళూరు : ఆదివాసీ, గిరిజన తెగలు, తాండాల నివాసులు, అణగారిన దళితులకు నివాస సదుపాయాలను కల్పించాలని డిమాండు చేస్తూ మైసూరు బ్యాంకు కూడలిలో కొన్ని సంఘాల ప్రతినిధులు సంతకాల సేకరణ ఉద్యమాన్ని నిర్వహించారు. హమ్‌గిర్ కటుమాళా- కర్నాటక అనే నినాదంతో నిర్వాసితులకు భూములను, ఇళ్లను అందించేందుకు చట్టంలో సవరణ చేయాలని ఆందోళనకు నేతృత్వం వహించిన మాజీ మంత్రి బి.టి. లలితా నాయక్ డిమాండు చేశారు. తాండాలను రెవెన్యూ గ్రామాలుగా మార్చేందుకు కర్ణాటక భూ సంస్కరణల చట్టం లోని 37వ నిబంధనను మార్చాలని, ముసాయిదాను రాష్ట్రపతి వద్దకు పంపి తక్షణమే ఆమోదం పొందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యల్ని తీసుకోవలసి ఉందని ఆమె పేర్కొన్నారు.

# నగరంలో నగధగలు

### 6నుంచి జాతీయ స్థాయి ప్రదర్శన

బెంగళూరు : జాతీయ నగల ప్రదర్శన ఈనెల 6నుంచి నగరంలో ప్రారంభం కానుంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఖ్యాతి పొందిన ప్రాచీన ఆధునిక నమూనాలతో కూడిన బంగారు నగలు, వజ్రాభరణాల్ని ప్రదర్శనలో ఉంచనున్నారు. నగల ప్రదర్శనలో భాగంగా ఇక్కడ వివిధ నగలు ధరించిన రూపదర్శులతో ఫ్యాషన్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శనకు ప్రచార రాయబారిగా వ్యవహరిస్తున్న కన్నడ నటి రచితరామ్, రూపదర్శులతో కలిసి ర్యాంప్‌పై నడిచారు. వారంతా ప్రాచీన ఆధునిక నమూనాలతో కూడిన బంగారు, వజ్రాభరణాల్ని ధరించి ప్రదర్శించారు. జైపూర్ కుందన్, మీనాక్షి నగలు, రాజస్తాన్ ధేవా నగలు, బెంగాల్, గుజరాత్, తదితర ప్రాంతాల్లో ఖ్యాతి పొందిన ఆభరణాల్ని ప్రదర్శనలో ఉంచుతామని ప్రదర్శన సంచాలకుడు సందీప్ బేకల్ విలేఖరులకు తెలిపారు. నగరంలోని సెయింట్ జోసెఫ్ కళాశాల మైదానంలో ప్రదర్శన ఏర్పాటు చేశామని, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ నగల వ్యాపార సంస్థలు పాల్గొంటారని, 120 దుకాణాల్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. అన్ని రకాల నమూనాలు ఒకే దగ్గర దొరుకుతుండటం వల్ల ప్రజలకు అనుకూలమవుతుందని ఎమ్మెల్సీ టి.ఎ.శరవణ అభి ప్రాయం వెలిబుచ్చారు. తక్కువ ధరలకు ఉత్తమ నమూనాలతో కూడిన నగల్ని కొనుగోలు చేయవచ్చునని తెలియజేశారు. రూపదర్శినులు సంప్రదాయ, ఆధునిక దుస్తులు ధరించి వాటికి అతికినట్లు నగలు ధరించి పిల్లినడక నడిచారు.

# ఉపాధి హామీ పథకం సిబ్బంది ధర్నా

పర్లాఖెముండి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లా సిబ్బంది మంగళవారం ధర్నా చేశారు. ఈ పథకంలో జిల్లాలో 150 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 103 మంది గ్రామీణ రోజ్‌గార్ సేవకులు. ఈ సేవకులు గత నెల 18వ తేదీ నుంచి ధర్నా చేస్తుండగా ఇతర సిబ్బంది కూడా ధర్నాలో పాల్గొన్నారు. ఉద్యోగ భద్రత, ఉద్యోగాల క్రమబద్ధీకరణ వంటి పలు కోర్కెలు ప్రభుత్వం పరిష్కరించాలని వీరు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయిలో కూడా భువనేశ్వర్‌లో మహా ధర్నా నిర్వహించేందుకు రాష్ట్ర నాయకులు సన్నాహాలు చేస్తున్నట్లు ఇక్కడి నాయకులు తెలిపారు. బినోద్‌గౌడో, అప్పలరాజు, లింగరాజు తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

### ఈనెల8న నటీనటుల సంఘం

# సర్వసభ్య సమావేశం

చెన్నై : దక్షిణ భారత నటీనటుల సంఘం 64వ సర్వసభ్య సమావేశం ఈ నెల ఎనిమిదో తేదీన జరగనుంది. ఈ విషయమై నటీనటుల సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సమావేశం ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు అన్నాసాలైలోని కామరాజర్ అరంగంలో ప్రారంభంకానుంది. దీనికి సంబంధించిన సభ్యులందరికీ ఆహ్వానం పంపించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇందులో సీనియర్ నటీనటులు, నిర్వాహకులు, సభ్యులంతా పాల్గొననున్నారు. నటీనటుల సంఘం అధ్యక్షుడు నాజర్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి విశాల్ స్వాగతోపన్యాసం చేస్తారు. ఉపాధ్యక్షుడు కరుణాస్ 2016- 17 సంవత్సరానికి సంబంధించిన నివేదికను, ఆదాయ వ్యయాలను సమర్పించనున్నారు. భవిష్య ప్రణాళిక గురించి కోశాధికారి కార్తిక్ ప్రసంగిస్తారు.

మరో ఉపాధ్యక్షుడు పొన్‌వన్నన్ వందన సమర్పణ చేస్తారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులంతా తప్పకుండా పాల్గొనాలని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సూపర్‌స్టార్ రజనీకాంత్, కమల్‌హాసన్ తదితరులు పాల్గొననున్నారు.

# నీటి చౌర్యం జరగకుండా చర్యలు

ఒంగోలు : జిల్లాలో సాగర్ జలాలు 15 రోజుల పాటు కాలువనకు వస్తాయని, ఎక్కడా నీటి చౌర్యం జరగకుండా అన్ని విధాలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని జేసీ ఎస్.నాగలక్ష్మి అన్నారు. కలెక్టరేట్ నుంచి జేసీ జిల్లాలోని అధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని చెరువులను ప్రణాళికా బద్ధంగా నింపుకోవాలన్నారు. ఎస్‌ఈ వెంకట రమణ మాట్లాడుతూ జిల్లాకు 1.3 టీఎంసీల నీరు వచ్చిందని, జిల్లాలో నీరు ప్రవేశించే కేంద్రాల్లో డిజైన్ ప్రకారమే నీరొస్తోందన్నారు. జేసీ మాట్లాడుతూ నీటి విడుదల విషయలో మేజర్లు, మైనర్లకు రావా ల్సిన డిజైన్ ప్రకారం నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రానున్న వేసవికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ ఉదయరాణి జిల్లా అధికారులు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

### విభిన్న ప్రతిభావంతులకు

# వాహనాలు అందిస్తాం

కర్నూలు : ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయసంస్థ ఆధ్వర్యంలో 2017-18 సంవత్సరానికిగాను విభిన్న ప్రతిభావంతులకు (శారీరక వైకల్యం కలిగిన) మోటరైజ్డ్ మూడు చక్రాల వాహనాలు, బ్యాటరీ సాయంతో నడిపే వీల్‌ఛైర్స్‌ను ఉచితంగా అందించనున్నామని, దీనికిగాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవ ృద్ధులు సహాయ సంచాలకులు భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 15, 16 తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 23వ తేదీలోగా కలెక్టరేట్‌లోని విభిన్న ప్రతిభావంతులు, వయోవ ృద్ధుల సహాయ సంచాలకుల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారంతోపాటు సదరం వైద్య ధ్రువీకరణ పత్రం, పది మార్కుల జాబితా, పోస్టు గ్రాడ్యుయేషన్ పీజీ, వ ృత్తి విద్యా కోర్సుల (ప్రొఫెషనల్ కోర్సుల) విద్యార్థులు తమ విద్యాసంస్థ నుంచి పొందిన బోనఫైడ్ ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు తదితర వాటితో కలిపి దరఖాస్తును కలెక్టరేట్‌లో అందజేయాలన్నారు.

# సమస్యల పరిష్కారానికి క ృషి చేయాలి

ఆస్పరి: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు క ృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి చెంగలరాయుడు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో పల్లె పిలుపు కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మే24 నుంచి ఇప్పటవరకు దాదాపు 31 అర్జీలు వచ్చాయని వాటిలో 21 సమస్యలను పరిష్కరించినట్లు ఎంపీడీవో సలీంభాష ఆయనకు వివరించారు.

# డంపింగ్ యార్డును తొలగించాలి

బ్రహ్మపుర : బీఎమ్సీ 36వ వార్డులోని లంజిపల్లి జాతర మైదానం సమీపాన పలు వీధుల వద్ద బీఎమ్సీ చెత్తను వేస్తోందని, దీంతో ఆ ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతోందని లంజిపల్లి వాసులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి నుంచి డంపింగ్ పాయింట్‌ను తొలగించాలని పలుమార్లు అధికారులకు చెప్పినా, లిఖిత పూర్వకంగా తెలియజేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇక్కడ చెత్త వేస్తుండడంతో లంజిపల్లి వాసులు, బిజద నాయకుడు ఉమానాయక్, బీఎమ్సీ సహారోగ్యాధికారి రంజిత్‌కుమార్ పాత్రల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. జాతర మైదానం పక్కనే అమ్మవారి అలయం ఉందని, డంపింగ్ పాయింట్‌లో చెత్తకుప్పలు వేయడంతో ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి దాపురిస్తోందని వీధుల వాసులు చెప్పారు. వెంటనే చెత్తకుండీను ఇక్కడ్నుంచి తొలగించకపోతే పరిస్థితి ఇంకా తీవ్రంగా మారనుందని బీఎమ్సీ అధికారికి వీధివాసులు రాజేష్‌పట్నాయక్, హరిగౌడొ, లడుకిషోర్ సాహు, లింగరాజ్ రెడ్డి, రంజన్‌కుమార్ సరోజ్ పాఢిలు ఆగ్రహంతో చెప్పారు.

# ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్



కాశీనగర్ : సమితి కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సుధాంశు మోహన్ శ్యామల్ ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. అదనపు ఎస్పీ మహమ్మద్ ఇంతియాజ్ ఆలమ్, ఐటిడిఏ పిఏ పరిఖిత సెఠి, సమితి అధ్యక్షుడు చిత్రి సింహాద్రి తదితరులు ఇందులో పాల్గొన్నారు. మొత్తం 77 వినతులు అందగా, ఇందులో వ్యక్తిగత సమస్యలపై 14 ఫిర్యాదులందాయి. ఫిర్యాదులలో ముఖ్యంగా హడ్డుభంగి, గైబా రహదారి సమస్య, అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లు, గత ఒకటిన్నర సంవత్సరాలుగా బిల్లులు కాని మరుగుదొడ్ల బకాయిలపై వినతులు అందాయని బీడీఓ మనోరంజన్ సాహు అన్నారు.

# 'డెంగీ నివారణకు సత్వర చర్యలు'

చెన్నై : డెంగీ నివారణకు తమ సర్కారు అన్ని చర్యలూ తీసుకుంటోందని ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. ఆయన అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. అడయారు గ్రీన్ వేస్ రోడ్‌లోని ఆయన నివాసంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విజయభాస్కర్, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. డెంగీ జ్వరాన్ని అదుపు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఇతర జ్వరాలతో బాధపడుతున్న వారికి కూడా మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

సమావేశం ముగిసిన తర్వాత ఆరోగ్య శాఖ మంత్రి విజయభాస్కర్ విలేకర్లతో మాట్లాడుతూ.... డెంగీ బాధితులు ప్రాణాలు కోల్పోకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆ మేరకు అన్ని వైద్యశాలల్లోనూ 24 గంటల పాటు వైద్య బృందం విధి నిర్వహణలో ఉండేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. ప్రజలు సుల భంగా అర్థం చేసుకొనే రీతిలో అవగాహన ప్రచారాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నగరాలు, మున్సిపాలిటీలు, పట్టణ పంచాయతీ, గ్రామీణ ప్రాంతాల్లోనూ నీటిని శుద్ధీకరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జన సంచారం అధికంగా ఉండే రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, బజార్లు తదితర ప్రాంతాల్లో నేలవేము కషాయాన్ని పంపిణీ చేస్తామని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

## దేశం పట్ల బాధ్యతతో వ్యవహరించటమే గాంధీ ధర్మం

విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.రామకృష్ణారావు 85వ జన్మదినోత్సవ వేడుకలలో భాగంగా 21వ శతాబ్దిలో గాంధి ఆలోచనల ప్రాధాన్యత గ్రంధాన్ని శాసనసభ స్పీకర్ బుధవారం ఆవిష్కరించి, ప్రసంగించారు. స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు పూర్తయినా నేటికి దేశంలోని 60 శాతం మంది ప్రజలు మరుగుదొడ్డి వసతి లేకుండా గడపటం విచారకరమన్నారు. స్వచ్ఛభారత్ ద్వారానే గాంధి కోరుకున్న స్వేచ్ఛాభారత్ సిద్ధిస్తుందని డాక్టర్ శివప్రసాద్‌రావు అభిప్రాయపడ్డారు. దేశ జనాభా పెరుగుదలను ఒకప్పుడు సమస్యగా పరిగణించేవారని నేడు జనాభాను మానవ వనరులుగా పరిగణిస్తూ వాటి అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వాలలో, ప్రజలలో అంకితభావం ఉంటే భారతదేశం ప్రపంచంలోనే అగ్రదేశంగా చిరకాలం నిలుస్తుందని పేర్కొన్నారు. గీతం ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ కోనేరు రామకృష్ణారావు దేశం గర్వించదగ్గ విద్యావేత్త అని అలాగే స్వర్గీయ ఎన్‌టిఆర్ అంతరంగిక సలహాదారుగా ఉన్నారని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలు వెనుక ప్రొఫెసర్ కోనేరు రామకృష్ణారావు చేసిన సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు.

విశాఖ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ కె.హరిబాబు మాట్లాడుతూ గాంధి ఆలోచనలకు కార్యరూపం ఇస్తూ కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలతో పాటు పేద ప్రజల సామాజిక జీవనానికి భద్రత కల్పించే అంత్యోదయ పథకం, ముద్ర రుణాలు ప్రవేశ పెట్టిందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ కోనేరు రామకృష్ణారావు గాంధి తత్వాన్ని లోతుగా అర్థం చేసుకుని ప్రస్తుత తరానికి తన రచన వ్యాసంగం ద్వారా మార్గదర్శకం చేయడం అభినందనీయమన్నారు.

గీతం అధ్యక్షులు డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తి మాట్లాడుతూ ప్రొఫెసర్ కోనేరు రామకృష్ణారావు మార్గదర్శకంలో గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్ ద్వారా గాంధి ఆలోచనలను, మార్గాన్ని భవిష్య తరాలకు సహితం అందించే ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు.

గీతం ఛాన్సలర్ ప్రొఫెసర్ కోనేరు రామకృష్ణారావు మాట్లాడుతూ గాంధి మహాత్ముని విగ్రహాలకు, మ్యూజియంలకు పరిమితం చేయరాదని గాంధి మార్గాన్ని అనుసరించటం వల్ల కలిగే ప్రయోజనాలను యువతకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

గీతం విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ గాంధి తత్వాన్ని, ఆలోచనలను విద్యార్థులలో స్ఫూర్తిదాయకంగా నింపే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు ప్రత్యేకంగా హాజరై ప్రొఫెసర్ కోనేరు రామకృష్ణారావును ఆంధ్ర విశ్వవిద్యాలయం విశిష్ట ప్రొఫెసర్‌గా నియమిస్తూ తీసుకున్న ఉత్తర్వుల ప్రతిని అందజేశారు.

కార్యక్రమంలో బీహార్ సెంట్రల్ విశ్వవిద్యాలయం మాజీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ జనక్ పాండే, గాంధి స్మ ృతి కేంద్రం మాజీ డైరక్టర్ డాక్టర్ సవితాసింగ్, గీతం స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్ ఇన్‌ఛార్జి డైరక్టర్ డాక్టర్ రోశిట్టా జోసఫ్, గీతం ప్రొ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో ఉపగ్రహాలదే కీలకపాత్ర

వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ... అంతరిక్ష సేవలు సామాన్యుడికి అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఉపగ్రహాల ద్వారా దేశం ఎంతో అభివృద్ధి సాధించిందని అన్నారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే అంతరిక్ష ప్రయోగాల్లో మనమే ముందున్నామని... శ్రీహరికోట నుంచి విదేశాలకు చెందిన ఎన్నో ఉపగ్రహాలను నింగిలోకి పంపిన ఘనత మనసొంతమని కొనియాడారు. విశాఖలో వచ్చిన హుద్‌హుద్ తుపాను, సునామీ తదితర విపత్కర సమయాల్లో ఉపగ్రహాలు అందించిన సమాచారంతో ముందస్తు చర్యలు చేపట్టి నష్టాన్ని నివారించామన్నారు.

దేశంలోని యువత వారసత్వ సంపదపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదగాలని కోరారు. తాను వీధిబడిలో చదివి ఉపరాష్ట్రపతి వరకు ఎదిగానని అన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ మోజులో పడి మాతృభాషను మరచిపోతున్నారని వెంకయ్యనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. అంతరిక్ష పరిశోధన పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్... ఆయన తర్వాత సతీష్ ధావన్ తదితరుల కాలంలో భారత్ ఎన్నో అంతరిక్ష పరిశోధనలు చేసిందని వివరించారు. శ్రీహరికోట నుంచి ఇస్రో అతి తక్కువ ఖర్చుతో మామ్‌ను నింగిలోకి పంపి విజయవంతం చేసిందన్నారు. చంద్రయాన్-1 ప్రయోగం ద్వారా చందమామపై నీళ్లు ఉన్నాయని గుర్తించామన్నారు. ఆ తర్వాత వెంకయ్యనాయుడు షార్‌లోని ముఖ్య విభాగాలను సందర్శించారు. ఆయన వెంట గవర్నర్ నరసింహన్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఇస్రో అధిపతి కిరణ్‌కుమార్, డైరెక్టర్ కున్హి కృష్ణన్, ఎంపీ వరప్రసాద్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే సంజీవయ్య ఉన్నారు.

## మారకపోతే.. మారిపోతారు

జరిగింది. పలు నియోజకవర్గాల్లో సక్రమంగా ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం అమలు కాకపోవడంపై సీఎం చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపరుచుకోకపోతే రాజకీయ భవిష్యత్తు ఉండదని ఇన్‌ఛార్జులను గట్టిగా హెచ్చరించారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం జరుగుతున్న తీరుపై గ్రేడింగ్ నిర్వహించానన్న చంద్రబాబు.. దాదాపు 20 నియజకవర్గాలు సీ, డీ గ్రేడింగ్‌లో ఉండడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆయా నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జులు పనితీరు మెరుగుపరుచుకోకపోతే అక్కడ కొత్త ముఖాలు చూస్తారని తేల్చిచెప్పారు.

ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణం, ద్వంద్వ పింఛన్లు వంటి ఫిర్యాదులు చర్చకు వచ్చాయి. ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఇంటికి రూ.80వేలు మాత్రమే నిధులు మంజూరయ్యాని, దీనిపై ప్రజల్లో కొంత అసంతృప్తి ఉందనే ప్రస్తావన చర్చకు వచ్చింది. త్వరితగతిన మిగిలిన మొత్తం కూడా మంజూరయ్యేలా చర్యలు తీసుకుందామని సీఎం అన్నారు. అలాగే రేషన్ దుకాణాల్లో చక్కెర, కిరోసిన్ అందకపోవడం వంటివి ప్రస్తావనకు రాగా.. దీనికి ప్రత్యామ్నాయాన్ని చూసి ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగేలా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి అన్నట్లు సమాచారం.

## ప్రజాస్వామ్యంలో రాజకీయ హింసకు తావులేదు

నిరసిస్తూ కేరళ సీఎం పినరయి విజయన్ సొంత జిల్లా కన్నూరులో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా మంగళవారం జన రక్ష యాత్రను ప్రారంభించారు. పదిహేను రోజులపాటు కేరళ వ్యాప్తంగా సాగే ఈ యాత్ర అక్టోబరు 17 న తిరువనంతపురంలో ముగుస్తుంది. ఈ యాత్రలో పలువురు కేంద్ర మంత్రులు కూడా పాల్గోనున్నారు. మూడు రోజుల పర్యటన కోసం కేరళకు విచ్చేసిన అమిత్ షా గురువారం కన్నూరులో జరిగే ర్యాలీలో పాల్గొంటారు. కేరళలో తమ కార్యకర్తలపై సీపీఎం దాడులకు నిరసనగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లో పాదయాత్ర చేపడతామని బీజేపీ అధ్యక్షుడు ప్రకటించారు. కమ్యూనిస్టుల దాడుల్లో ఇప్పటి వరకు కేరళలో 120 మంది భాజపా కార్యకర్తలు ప్రాణాలు కోల్పోగా, ఒక్క కన్నూరు జిల్లా నుంచే 84 మంది ఉన్నారని ఆరోపించారు. ఇందులో కేరళ సీఎం సొంత పట్టణంలోనే గతేడాది నుంచి 14 మంది హత్యకు గురయ్యారని పేర్కొన్నారు.

## నోట్ల రద్దు అర్థం లేని చర్య

కన్సల్టెంట్‌గా పని చేసిన నేపథ్యం ఉంది. దాదాపు ఏడాది కిందట మోడీ తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయం దుష్పరిణామాలు ఇప్పుడు ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నాయని వ్యాఖ్యానించారు. నోట్ల రద్దు ఆత్మహత్యతో సమానం అన్నారు. నోట్ల రద్దును సమర్థించుకునేందుకు మోడీ ప్రభుత్వం చాలా వాదనలు చేసిందని, అయితే అవన్నీ వీగిపోయాయని అన్నారు. అలాగే జీఎస్టీని అమల్లోకి తీసుకువచ్చిన తీరుపై కూడా శౌరి ధ్వజమెత్తారు. జీఎస్టీ అమలు దేశానికి స్వతంత్రం రావడంతో సమానమని మోడీ సర్కారు ఊదరగొట్టిందని, అయితే అమల్లోకి వచ్చిన అతి తక్కువ వ్యవధిలోనే ఆ విధానంలో మోడీ సర్కారు బోలెడన్ని మార్పు చేర్పులు చేసిందని శౌరి గుర్తు చేశారు. ఈ విధంగా ఈ మాజీ కమలనాథుడు మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాలను తూర్పారబట్టారు. గతంలో కూడా మోడీ తీరుపై పలుసార్లు ధ్వజమెత్తారు అరుణ్ శౌరి. ఆ సమయంలో భారతీయ జనతా పార్టీ ఆయనతో తమకు సంబంధం లేదని ప్రకటించింది. అరుణ్ శౌరి బీజేపీలో లేరు.. అని రెండేళ్ల కిందటే కమలం పార్టీ ఒక ప్రకటన చేసింది.

## అన్ని జిల్లాల్లో పర్యటించి నివేదిక అందజేస్తాం

ఎస్టీలో చేర్చటం దారుణమని గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు లక్ష్మానాయక్ అన్నారు. ఒక్క రొట్టె ముక్కను ఇచ్చి అందరు పంచుకోండని చెప్పి, ఇప్పుడు మరికొందరికి అదే రొట్టెను అందించాలనే విధంగా ఆలోచిస్తుందని, ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించాలని, వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చవద్దని కోరారు.

ప్రజాభిప్రాయ సేకరణ సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ కాన్వాయ్‌ను పలుమార్లు గిరిజన సంఘాల నాయకులు అడ్డుకున్నారు. వాహనాన్ని ముందుకు కదలనివ్వకుండా వాహనం ఎదుట పడుకుని నినాదాలు చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ సభలోనూ వివిధ సంఘాల నాయకులు నినాదాలు చేశారు.

## ఇష్టపడి పని చేస్తేనే ప్రజాదరణ

ఎంత నీటిని ఎత్తిపోస్తుంది. నీటిని దేనితో లెక్కిస్తాం.. వంటి వాటిని సమగ్రంగా తెలుసుకోవాలి. రైతులు, ప్రజల వద్దకు వెళ్లినపుడు అన్నింటిపై అవగాహన ఉంటేనే విధుల్లో రాణిస్తారని హితవు పలికారు. పీఏబీఆర్ డీఈ పక్కీరప్ప, జేఈఈ శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రిమ్స్‌లో ఉద్యోగుల వైద్యసేవలు

## ఇన్ పేషెంట్ల కోసం ప్రత్యేక గదులు .. డైరెక్టర్ డాక్టర్ వల్లీశ్వరి

ఒంగోలు : ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద రిమ్స్‌లో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు డైరెక్టర్ వల్లీశ్వరి తెలిపారు. ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వఛ్ ఆసుపత్రి అవార్డు వచ్చిన సందర్భంగా పారిశుద్ధ్య విభాగం సిబ్బందిని డైరెక్టర్ అభినందించారు. వైద్యులు సైతం డైరెక్టర్‌కు అభినందనలు తెలిపారు. వల్లీశ్వరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం గర్వకారణమన్నారు. రిమ్స్‌లో ఉద్యోగ ఆరోగ్య పథకం కింద అన్ని సౌకర్యాలతో వైద్య సేవలు అందిస్తామన్నారు. ఉద్యోగులు, జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రిమ్స్‌లో 50 ప్రత్యేక గదులు ఉన్నాయని, వాటిలో కొన్నిటికి ఏసీ సౌకర్యం కూడా ఉందన్నారు. ఏసీ గదులకు అదనంగా ఉద్యోగులు రుసుము చెల్లించాలని తెలిపారు. ఇప్పటి వరకూ 100 మంది ఉద్యోగులు ఈ పథకం కింద ఉచిత వైద్యం పొందారన్నారు. పథకం కింద వైద్యం కోసం వచ్చిన వారు సమన్వయకర్త డాక్టర్ కొండలరావును సంప్రదిస్తే... ఆయన అవసరమైన వైద్యుల వద్దకు సిఫారసు చేస్తారన్నారు. ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరిస్తుందని, వారి కోసం ప్రత్యేకంగా మందులు కూడా అందజేస్తారన్నారు. ఉద్యోగులు, పింఛనర్లు వినియోగించుకోవాలని కోరారు.

గ్రహణమొర్రికి శస్త్ర చికిత్సలు

గ్రహణ మొర్రి, గ్రహణశూలకు ఇకపై రిమ్స్‌లోనే శస్త్రచికిత్సలు చేస్తారని డైరెక్టర్ వల్లీశ్వరి పేర్కొన్నారు. స్మైల్‌ట్రీ పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసినట్లు వివరించారు. 2018 నుంచి డయాలసిస్ విభాగాన్ని కొత్త ఏజెన్సీ నిర్వహిస్తుందన్నారు. రిమ్స్‌లో గైనకాలజీ విభాగంలో ఇన్‌పేషంట్ల సంఖ్య, ప్రసవాలు గణనీయంగా పెరగడంతో 50 పడకలతో పై అంతస్తులో నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు.

గతంతో నెలకు 250 ప్రసవాలు జరుగుతుండగా, అక్టోబరులో 410 జరిగాయన్నారు. దీనితో అదనపు పడకలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

# విజయవాడ ప్రాంతీయ వార్తలు

## 9న తంగడంచకు సీఎం రాక

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచలో అమెరికాకు చెందిన అయోవా విశ్వవిద్యాలయం, ఆచార్య రంగా విత్తన పరిశోధన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మెగా సీడ్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 600 ఎకరాల్లో రూ.670 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మెగాసీడ్ పార్కుకు ఈనెల 9న సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయనున్నారనీ జిల్లా వ్యవసాయశాఖ జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం అందుకు సంబంధించిన ఏర్పాట్లను, హెలిప్యాడ్ దిగే ప్రదేశాన్ని వారు పరిశీలించారు.

## పనులు నాణ్యంగా చేపట్టండి

పగిడ్యాల: మండల కేంద్రంలోని భవిత భవనం నిర్మాణ పనులు నాణ్యంగా చేపట్టాలని ఎస్ఎస్ఏ డీఈ శిల్ప అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనం వద్ద చేపట్టిన పనులను ఆమె పరిశీలించారు. గుత్తేదారుడు నాసిరకమైన కంకర, ఇసుకలను నిర్మాణానికి వినియోగిస్తున్నాడని ఆగ్రహించారు. పనులు నాణ్యంగా చేయకపోతే బిల్లులు నిలిపేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఈ భవనాల నిర్మాణాలు ప్రారంభించారని వాటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారుడికి సూచించారు. కార్యక్రమంలో ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే తెదేపా ధ్యేయం

కోసిగి: రాష్ట్రంలోని పేదల సంక్షేమమే తెదేపా ధ్యేయమని తెదేపా జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సజ్జలగుడ్డం, జంపాపురం, ఐరనగల్లు, దేవరమెట్ట గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటికీ తెదేపా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆయా గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉండే సమస్యలను పరిష్కరించేందుకే ఇంటింటికీ తెదేపా కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో కోసిగి సర్పంచి ముత్తిరెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు రామిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మారెప్ప, గ్రామసర్పంచి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమపై చంద్రబాబుది సవతి ప్రేమ



- ఎంపీ అవినాష్‌రెడ్డి

వెలుగోడు : రాయలసీమపై చంద్రబాబుది సవతి ప్రేమ అని కడప ఎంపీ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో కలిసి వెలుగోడు తెలుగుగంగ జలాశయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చెన్నై ప్రధాన కాల్వలో ప్రవహిస్తున్న నీటి ఉద్ధృతిని పరిశీలించారు. తెలుగు గంగ డీఈ రాఘురామిరెడ్డితో వారు మాట్లాడి నీటి వివరాలను అడిగి తెలుసు కున్నారు. తెలుగు గంగ జలా శయంలో 12.257 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ప్రస్తుతం జలాశయంలోకి 9,600 క్యూసె క్కుల జలాలు వస్తున్నాయని, ఇక్కడి నుంచి దిగువనకు 1,100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు డీఈ వారికి వివరించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ శ్రీశైలం జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం ఉందని వెంటనే వెలుగోడు జలాశయాన్ని నింపి కడప జిల్లాకు నీటిని విడుదల చేయాలన్నారు. చంద్రబాబు నాయుడు ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించడం లేదని ఆరోపించారు. కరవు కాటకాలు, చంద్రబాబు రెండు కవలల్లాంటివారన్నారు. కార్యక్రమంలో శ్రీశైల నియోజకవర్గ వైకాపా బాధ్యుడు బుడ్డా శేషారెడ్డి, నాయకులు శిల్పా భువనేశ్వర రెడ్డి, జయ రామిరెడ్డి, తిరుపంరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 7వరకు బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ వారోత్సవాలు

నెల్లూరు : బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ వారోత్సవాలను ఈనెల 7 వరకు జరుగుతాయని ఆసంస్థ జిల్లా ప్రిన్సిపల్ జనరల్ మేనేజరు రవిబాబు తెలిపారు.

నగరంలోని బీఎస్ఎన్ఎల్ కార్యా లయం సమావేశ మందిరంలో జరిగిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ.. వారోత్సవాలలో భాగంగా బుధవారం సూళ్లూరుపేటలో మధ్యా హ్నం 3గంటల నుంచి 5 గంటల వరకు సమా వేశం జరుగుతుందన్నారు. ఈనెల 5న నగరం లోని ప్రధాన బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉదయం టెలిఫోన్ అదాలత్ జరుగుతుందని వివరించారు. 6న జిల్లాలోని అన్ని బీఎస్ఎన్ఎల్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయాల్లో కస్టమర్ మీట్, 7న గూడూరు బీఎస్ఎన్ఎల్ కార్యా లయంలో ఉదయం కస్టమర్ ఎడ్యుకేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సమా వేశంలో డీజీఎంలు జయరామిరెడ్డి, రవీంద్ర నాథ్, ఏజీఎం సేల్స్ మేనేజర్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన సీఎం

ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



కొడవలూరు : రాష్ట్రంలో ప్రజలు డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోతుంటే వారికి సరైన వైద్య సేవలను అందించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైఫల్యం చెందారని ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ఆరోపించారు. మండలంలోని కమ్మపాళెంలో తన కోటా నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం సంజీవనగర్ కాలనీలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రకాశం, నెల్లూరు, తూర్పుగోదావరి, విజయనగరం తదితర జిల్లాల్లో డెంగీ, విషజ్వరాల బారిన పడి వందలాది మంది పేదలు మృత్యువాత పడుతున్నారన్నారు. ఒక్క ప్రకాశం జిల్లాలోనే ప్రభుత్వ లెక్కల ప్రకారం 70 మంది రోగులు డెంగీతో ప్రాణాలు కోల్పోయారన్నారు. నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగీ రోగులకు ఎక్కించాల్సిన ప్లేట్‌లెట్స్ కణాల యంత్రం లేకపోవడంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. దీంతో నిరుపేదలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందక, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేక మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డెంగీ, మలేరియా వ్యాధులను అదుపులోకి తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు మాత్రం ఇంత వరకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీని తీసుకొస్తే నేడు సీఎం చంద్రబాబునాయుడు దాన్ని అనారోగ్యశ్రీగా మార్చేశారని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులను తొలగించారని ఆరోపించారు. జన్మభూమి కమిటీల పేరుతో తెదేపా వారికి పింఛన్లు వచ్చేలా చేశారన్నారు. మూడున్నరేళ్ల తెదేపా పాలనలో అవినీతి, దోపిడీ పెచ్చుమీరయ్యన్నారు. పోలవరం, అమరావతి, విద్యుత్తు ప్రాజెక్టుల పేర్లతో భారీ కుంభకోణాలు చోటు చేసుకున్నాయన్నారు. నవరత్నాలు పేరుతో జగన్మోహన్‌రెడ్డి పేదలకు మేలు జరిగే పథకాలను ప్రకటించారన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కూడా ప్రసంగించారు. కార్యక్రమంలో వైకాపా జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, రైతు సంఘం జిల్లా అధ్య క్షులు సూరా శ్రీనివాసులురెడ్డి, మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సర్పంచి నాపా నాగ భూషణమ్మ, జిల్లా కార్యదర్శిలు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, పెనాక శ్రీనివాసులు రెడ్డి, ఉప ఎంపీపీ కొండా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గర్భకోశ వ్యాధులపై అవగాహన, చికిత్స

ప్యాపిలి: మండలంలోని బోయిన్‌చెరువుపల్లె గ్రామంలో బుధవారం రాచర్ల పశువైద్యాధికారి డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో గర్భకోశ వ్యాధులున్న పశువులకు చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీటితో పాటు దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు శివనాయక్, నారాయణ తదితరులు వైద్య సేవలు అందించడంలో సహకరించారు.

## సమస్యల పరిష్కార వేదికే పల్లెపిలుపు

పగిడ్యాల: సమస్యలను పరిష్కరించడమే పల్లెపిలుపు కార్యక్రమం ఉద్దేశమని మండల ప్రత్యేక అధికారి వీరారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పగిడ్యాలలో పల్లె పిలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, చౌకదుకాణాలను ఆయన పరిశీలించారు. పురవీధుల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలోని ప్రజలు సమస్యలపై అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు కుమారస్వామి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ తెదేపా కార్యక్రమం

సి.బెళగల్: మండలంలోని ఇనగండ్ల గ్రామంలో బుధవారం కొడుమూరు ఎమ్మెల్యే మణి గాంధీ మండల తెదేపా నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహించారు. వీధుల్లో రహదారులన్నీ బురదమయంగా ఉన్నందున దశలవారిగా సీసీ రహదారులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటా తిరుగుతూ ఆరా తీశారు. అర్హులై ఉండి పింఛను రాని వ ృద్ధులను గుర్తించి వారి పేర్లు నమోదు చేసకున్నారు. కార్యక్రమంలో మండల తెదేపా కన్వీనర్ పాండురంగన్న, అయ్యపురెడ్డి, గూడూరు మాజీ కన్వీనర్ సుందర రాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమం తెదేపాతోనే సాధ్యం

కర్నూలు : తమది రైతుల ప్రభుత్వమని, వారి సంక్షేమానికి నిరంతరం పాటుపడుతామని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. నగరంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో 139 మంది కౌలు రైతులకు రుణ అర్హత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నో ఏళ్లుగా రుణాలు లభించక కౌలు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వారి కష్టాలు తొలగించేందుకే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది కౌలు రైతులకు రుణ సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. జిల్లాలో మొత్తం 19,500 మంది కౌలు రైతులు ఉండగా, మొదటి విడతలో 2016-17 ఆర్థిక సంవత్సరానికి 5 వేల మందికి రూ.300 కోట్లతో రుణాలిచ్చేలా ప్రణాళికలను రూపొందించా మన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గాంధీ జయంతి రోజున రాష్ట్రవ్యాప్తంగా గూడు లేని లక్ష మంది నిరుపేదలకు ఇళ్లు కట్టించి గృహప్రవేశం చేయించామన్నారు. నగరాన్ని మరింత సుందరంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు.

పార్టీలో సముచితస్థానం

ఈనెల 9వ తేదీన తంగడంచ గ్రామంలో మెగా సీడ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్నట్లు ఉప ముఖ్యమంత్రి కేఈ క ృష?మూర్తి పేర్కొన్నారు. తెదేపాలోకి ఎవరు వచ్చినా ఆహ్వానం పలుకుతామన్నారు. పార్టీలోకి వచ్చిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. కలెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో ఒక్కో కౌలు రైతుకు రూ.20 వేల చొప్పున 139 మందికి రుణాలు అందిస్తున్నామన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులతో తక్కువ పెట్టుబడి పెట్టి అధిక దిగుబడి సాధించా లన్నారు. కేడీసీసీబీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులను ఆదుకునేందుకు రుణ అర్హత కార్డులు, సాగు ధ్రువీకరణ పత్రాలు కలిగిన రైతులకు రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా కౌలు రైతులకు రుణాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఏపీఎస్ఐడీసీ ఛైర్మన్ కేఈ ప్రభాకర్ మాట్లాడారు. కేడీసీసీబీ సీఈవో రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీవో సుబ్బారావు,నగేష్ కుమార్, బ్యాంకు వైస్ ఛైర్మన్ అహ్మద్ హుసేన్ పాల్గొన్నారు.

## ఉత్తమ పంచాయతీగా ముక్తాపురం

కొమరోలు : వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టిన పంచాయతీగా ముక్తాపురం సర్పంచి ఉత్తమ పురస్కారాన్ని కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. పంచాయతీలోని అన్ని ఇళ్లలో మరుగుదొడ్లు నిర్మించి బహిరంగ మలవిసర్జనను నివారించినందుకుగాను స్వచ్ఛతే సేవ కింద పురస్కారాన్ని సర్పంచి బొంతా రాధ అందుకున్నట్లు కార్యదర్శి శివరామకృష్ణ తెలిపారు.

## ముగిసిన తలనీలాల పోగు సేకరణ వేలం పాట

పచ్చర్ల : నంద్యాల- ఒంగోలు ప్రధాన రహదారిలోని నల్లమల అటవీ క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన సర్వనరసింహస్వామి ఆలయంలో దేవాదాయశాఖ అధికారులు నిర్వహించిన తలనీలాల పోగు సేకరణకు గాను ఎట్టకేలకు మూడవసారి వేలంపాట జరిగింది. స్థానిక ఆలయ కార్యనిర్వహణాధికారి జనార్ధన్ శెట్టి ఆధ్వర్యంలో తలనీలాల పోగు సేకరణ వేలంపాట జరిగింది. ఇందుకు గాను గతేడాది రూ.3 లక్షలు రాగా, ఇప్పుడు రూ.2.85 లక్షలు మాత్రమే వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి మోహన్, భాస్కర్ రెడ్డి, నాగిరెడ్డి, రంగనాయకులు, మధు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడలకు నగర విద్యార్థి

నెల్లూరు : అండర్-17 జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు నెల్లూరు విద్యార్థి ఎంపికయ్యాడు. కోవూరుకు చెందిన ఎన్.నితిన్ నగరంలోని రత్నం కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. నితిన్ ప్రతిభను చూసి జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించాడు. అక్టోబరు ముంబైలోని వాన్‌కేడి మైదానంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా రత్నం కళాశాల ప్రిన్సిపల్ ఎం.ప్రభాకర్ నితిన్‌ను అభినందించారు.

## నవంబరు 14లోగా నవోదయకు దరఖాస్తు చేయాలి

కొమరోలు : జవహర్ నవోదయ విద్యాలయల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నవంబరు 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రధానోపాధ్యాయుని సంబంధిత ధ్రువీకరణ పత్రం పొందాలన్నారు. దాంతో కామన్ సర్వీసు సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి పదో తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

# పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు చర్యలు

మంత్రి నారాయణ స్పష్టీకరణ



నెల్లూరు : జిల్లాలోని పురపాలక పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు, కొత్తగా తరగతి గదులు నిర్మించేందుకు సామాజిక బాధ్యత నిధులు(సీఎస్ఆర్ ఫండ్) వినియోగించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సూచించారు. స్థానిక గోమతినగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గుత్తేదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని వసతులు, ఇతర అవసరాలపై చర్చించారు. పాఠశాలల్లో అదనపు గదుల విషయమై ఏఏ పాఠశాలలకు ఎన్ని గదులు కావాలి అనే విషయమై అక్కడికక్కడే వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలో మొత్తం 66 పాఠశాలలు, 2 జిల్లా పరిషత్తు పాఠశాలలు, రెండు ప్రభుత్వ పాఠశాలలకు కావాల్సిన కుర్చీలు, బల్లలు, బ్లాక్ బోర్డులు, ల్యాబ్‌లు, మరుగుదొడ్లు వంటి మౌలిక సౌకర్యాలతో పాటు అవసరమైన 77 తరగతి గదులను నిర్మించే బాధ్యతను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించామన్నారు. ఇవన్నీ పూర్తిచేయడానికి దాదాపు రూ.6.5 కోట్లు ఖర్చవుతుందని మంత్రి తెలిపారు.

మౌలిక వసతుల ఏర్పాటుకు నెల రోజులు గడువు విధించారు. తరగతుల నిర్మాణం 2018 జనవరి 1లోపుగా నిర్మించాలని ఆదేశించారు. వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా ప్రారంభిస్తామన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పాలనాధికారి రేవు ముత్యాలరాజు, తెదేపా నగర ఇన్‌ఛార్జి ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆదేశమే శిరోధార్యం : మంత్రి క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ నెల్లూరులో పుట్టి పెరిగిన మమకారంతో నెల్లూరు నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు ఎక్కువగా చేస్తున్నానని, అంతేతప్ప ఎన్నికల్లో పోటీ చేయాలనే తలంపుతోకాదని మంత్రి తెలిపారు. తాను ఏ పనిచేసినా నిశితంగా పరిశీలించి లోతుగా అధ్యయనం చేయడం అలవాటని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవాలంటే ఏదైనా నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో తిరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆ కోణంలోనే నెల్లూరు-1, నెల్లూరు-2 నియోజకవర్గాల్లో తిరుగుతున్నానని, నెల్లూరు నగరంలో పోటీ చేస్తానన్నది ప్రచారం మాత్రమేనని తెలిపారు.

## చెత్త తరలింపు రిక్షాల ప్రారంభం

కందులాపురం : పరిసరాల పరిశుభ్రతలో భాగంగా కందులాపురం పంచాయతీలోని చెత్తాచెదారాన్ని తరలించేందుకు కేటాయించిన రెండు రిక్షాలను సర్పంచి మెర్సీ కమలా ఆనర్స ప్రారంభించారు. స్వఛ్ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా వాటిని కేటాయించినట్లు తెలిపారు. తురిమెళ్ల, చిన్నకంభం పంచాయతీలకు రెండు చొప్పున రిక్షాలను అందుబాటులో ఉంచుతున్నట్లు ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ బ్రహ్మయ్య తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మురళి, బ్రహ్మయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లోనే రైతుల సమస్యల పరిష్కారం

రాచర్ల : రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగకుండా సమస్యలను గ్రామాల్లోనే పరిష్కరించాలని తహసీల్దారు కె.ఎలిజబెత్‌రాణి సూచించారు. వీఆర్వోల సమావేశంలో ఆమె మాట్లాడారు. వీఆర్వోలు గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండి భూ సంబంధిత, ఈ- పాస్‌పుస్తకాల సమస్యలను పరిశీలిస్తూ సర్వేలు వేగవంతం చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### ఆయుధ వ్యాపారం

అమెరికాలోని ఆయుధ వ్యాపారంపై అధ్యయనం చేయటం కోసం ఓ సామాజికవేత్త వెళ్లినప్పుడు అక్కడి ఆయుధ తయారీ కంపెనీలు చెప్పిన మాటలు గమనించదగినవి. మేం తయారు చేస్తున్న తుపాకులు అమ్ముడు పోవాలంటే ప్రపంచంలో ఎక్కడో ఒక చోట యుద్ధాన్నిప్రేరేపిస్తాం, ఆయుధాలు అమ్ముకుంటాం అని వారు నిస్సిగ్గుగా చెప్పుకున్నారు. ఈ ఆయుధ వ్యాపారం వల్ల ప్రపంచ దేశాలు ఎలా యుద్ధభూములుగా, శ్మశానాలుగా మారాయో చరిత్ర చెబుతూనే ఉన్నది. అమెరికాలోని లాస్ వెగాస్‌లో జరిగిన నరమేధంతో ఆ దేశమే కాదు, ప్రపంచమంతా ఉలిక్కిపడింది. కొన్నేళ్లుగా ఉగ్ర దాడులతో ప్రపంచమంతా వణికిపోతున్న తరుణంలో లాస్‌వెగాస్ మారణహోమం దాన్ని మరింత రెట్టింపు చేసింది. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద దాడిగా పేర్కొంటున్న ఈ ఘటనలో 58మంది తుపాకీ గుండ్లకు బలయ్యారు. 515మంది క్షతగాత్రులయ్యారు. అందులో కొందరు తీవ్ర గాయాలతో మృత్యువుతో పోరాడుతున్నారు. ఇలాంటి దాడులు అమెరికాకు కొత్తకాదు. గతంలోనూ ఇదే తీరు దాడులు జరిగాయి. ఓర్లాండో, కనెక్టికట్, అరోరా, కొలరాడో, అలబామా, వర్జీనియా, కిలీన్ తదితర ఘటనల్లో అనేకమంది మరణించారు. ప్రధానంగా పర్యాటక స్థలాలు, ప్రార్థనా మందిరాలు, స్కూళ్లు, నైట్ క్లబ్బులు లక్ష్యం గా గతంలోనూ దాడులు జరిగాయి. అయితే ఇంత పెద్ద సంఖ్యలో చనిపోవటం అమెరికాలో ఇదే మొదటిసారి. రెండేళ్ల క్రితం ప్యారిస్‌లో సంగీత కచేరీపై జరిగిన దాడిలో 129 మంది చనిపోగా, 350మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇలాంటి దాడి జరిగినప్పుడల్లా నేరస్థుడికి ఉగ్రవాద మూలాలున్నాయా అనే సందేహం వెలిబుచ్చడం, ఉగ్రవాద మూకలకు ఈ భూతలంపై చోటు లేకుండా చేస్తామని ప్రకటించటం పాలక ప్రభుత్వాలకు అలవాటుగా మారింది. దాడికి పాల్పడింది ఉన్మాది మాత్రమేనని, ఉగ్రవాద మూలాలు లేవని తేలితే అదొక కాకతాళీయ ఘటనగా చూపి చేతులు దులుపుకోవటం పాలకులకు పరిపాటి అయ్యింది. ఇలాంటి దాడుల కు మూలాలెక్కడున్నాయో తెలుసుకుని, ఇలాంటి నరమేధాలకు తావులేని సురక్షిత సమాజా న్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నది ప్రభుత్వాల పరమావధిగా మారాలి. కానీ ఇది అగ్రరాజ్యం అమెరికాలో ఇసుమంతైనా లేకపోవటమే ఈ తాజా విషాదానికి మూలకారణంగా చెప్పక తప్పదు. ప్రపంచానికి అతిపెద్ద సవాలుగా మారిన ఐఎస్, జీహాదీల మారణహోమాలు అటుంచితే, అమెరికాను పట్టిపీడిస్తున్నది మాత్రం తుపాకీ సం స్కృతి. ప్రపంచంలో మరెక్కడాలేని విధంగా తుపాకుల తయారీ ఓ పరిశ్రమగా, లాభాలు తెచ్చిపెట్టే సులువైన వ్యాపారంగా అమెరికాలోనే ఉన్న ది. అమెరికా జనాభా సుమారు ముప్ఫై రెండున్నర కోట్లు అయితే అక్కడ ప్రజల వద్ద ఉన్న తుపాకుల సంఖ్య 31 కోట్లు. అమెరికాలో ఏటా పదిలక్షల తుపాకులు తయారవుతున్నట్లు అక్కడి వ్యాపార వర్గాలే చెబుతున్నాయి. ప్రతి వందమందిలో 89 మంది దగ్గర తుపాకులున్నాయి. ప్రపంచంలో మరే దేశంలో లేని విధంగా అమెరికాలో తుపాకు లు అందరికీ అందుబాటులో ఉండటమే ఈ గన్ కల్చర్‌కు మూలకారణం. అమెరికాలో 1965 నుం చి వివిధ యుద్ధాల్లో మరణించిన వారి సంఖ్య కం టే తుపాకుల సంస్కృతికి బలయిన వారి సంఖ్యే అధికమని గణాంకాలు చెబుతున్నాయి. చారిత్రకం గా చూస్తే, అమెరికా అంటేనే వలస దేశం. స్థానిక రెడ్ ఇండియన్లను నిర్వాసితులను చేస్తూ పాదుకొన్న అమెరికాలో వలసవాదులు తమ స్వీయ రక్షణకోసం తుపాకులను కలిగి ఉండటం ఒక సామాజిక అవసరంగా భావించారు. తుపాకులను వ్యక్తిగతంగా కలిగి ఉండే విధంగా చట్టాలు రూపొందించుకున్నారు. సామాజికంగా చూస్తే, ఈ తుపాకులు అన్నివర్గాల దగ్గర ఉన్నట్టు కనిపిస్తున్నా, ఒక వర్గం వారి దగ్గరే ఎక్కువగా ఉన్నాయి. సామాజిక ఉద్రిక్తతలకు తోడు ఆయుధ వ్యాపారుల విచ్చలవిడితనం కూడా అమెరికా సమాజానికి పెనుముప్పుగా మారింది. ఆయుధాల తయారీదారులు ప్రతి సంవత్సరం 88వేల కోట్ల ఆదాయం ఆర్జిస్తున్నారంటే అక్కడ ఆయుధ వ్యాపారం ఎంతగా సాగుతున్నదో తెలుస్తున్నది. లాస్ వెగాస్‌లో సంగీత కచేరీపై జరిగిన దాడి జరిగిన తీరు గమనించదగినది. హంతకుడు సమీపంలోని ఓ హోటల్‌లో 320 అడుగుల ఎత్తులోని 32వ అంతస్తునుంచి కాల్పులకు తెగబడ్డాడు. 365మీటర్ల దూరంలోని సందర్శకులపై గుళ్లవర్షం కురిపించాడు. అంటే అతడు వాడింది సాధారణ తుపాకీ కాదు. ఆటోమెటిక్ మిషన్‌గన్ అయితేనే అంత దూరంలోని జన సమూహం మీద గుండ్ల వర్షం కురిపించగలడు. సాధారణ వ్యక్తి చేతుల్లోకి ఆటోమెటిక్ ఆయుధాలు అలవోకగా చేరుతున్నాయంటేనే డొల్లతనాన్ని అర్థం చేసు కోవచ్చు.

## గుర్మీత్‌కు జీవితఖైదు విధించాలి



పంచకుల: డేరా సచ్చా సౌధా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు జీవిత ఖైదు విధించాలని కోరుతూ బాధిత మహిళలు బుధవారం పంజాబ్, హరియాణా హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఇద్దరు మహిళలు న్యాయవాది నవ్‌కిరణ్ సింగ్ ద్వారా హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. గుర్మీత్‌కు విధించిన 20ఏళ్ల జైలు శిక్ష సరిపోదని.. జీవితఖైదు విధించాల్సిందిగా పిటిషన్‌లో కోరారు.

ఈ ఇద్దరు మహిళలపై గుర్మీత్ అత్యాచారానికి పాల్పడినట్లు 2002లో కేసు నమోదైంది. పదిహేనేళ్ల నాటి ఈ కేసులో ఆగస్టు 25న పంచకులలోని సీబీఐ న్యాయస్థానం గుర్మీత్‌ను దోషిగా తేల్చింది. ఈ మేరకు తీర్పు వెలువరించిన రోజు పంజాబ్, హరియాణాల్లోని పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ సందర్భంగా 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

## బ్యాంకుకు అరకిలోమీటరు సొరంగం..!



సావోపాలో: రాత్రి సమయాల్లో బ్యాంకులకు కన్నమేసి డబ్బులు దోచుకున్నారన్న వార్తలు అప్పుడప్పుడూ వింటూనే ఉంటాం. బ్రెజిల్‌లోని కొందరు దొంగలు కూడా బ్యాంకును దోచుకునేందుకు పక్కా ప్లాన్ వేశారు. ఇందుకోసం ఏకంగా బ్యాంకుకు సొరంగాన్నే తవ్వేశారు. ఒకటి కాదు రెండు కాదు దాదాపు 600 మీటర్ల దూరం భూగర్భ మార్గాన్ని సిద్ధం చేసుకున్నారు. అయితే వారి ప్లాన్ బెడిసికొట్టి పోలీసుల చేతికి చిక్కారు.

బ్రెజిల్ ఆర్థిక రాజధాని సావోపాలోలో బాంకో దో బ్రాసిల్ బ్యాంకు బ్రాంచీని దోచుకునేందుకు కొందరు దొంగలు ప్రయత్నించారు. ఇందుకోసం నాలుగు నెలల పాటు శ్రమించి బ్యాంకుకు సొరంగ మార్గాన్ని ఏర్పాటుచేశారు. ఓ ఇంటి నుంచి ఈ సొరంగం తవ్వకం ప్రారంభించి దాదాపు 600 మీటర్ల భూగర్భ మార్గాన్ని తయారుచేశారు. అందులో లైట్లు, ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేశారు. అయితే బ్యాంకు దోచుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు నిఘావర్గాలకు సమాచారం రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. 16 మంది అనుమానితులను అరెస్టు చేసి విచారించారు.

విచారణలో వారు చెప్పిన దొంగతనం ప్లాన్ విని పోలీసులే అవాక్కయ్యారట. బ్యాంకు నుంచి 317 మిలియన్ డాలర్లు దోచుకునేందుకు తాము ప్రణాళిక రచించామని.. ఇందుకోసం బ్యాంకుకు సొరంగం తవ్వినట్లు సదరు నిందితులు చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ దొంగతనం జరిగి ఉంటే ప్రపంచంలోనే భారీ చోరీ అయ్యేదని పోలీసులు చెబుతున్నారు.

## ఎస్‌బీఐ ఛైర్మన్‌గా రజనీశ్‌కుమార్



దిల్లీ:స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) తదుపరి ఛైర్మన్‌గా రజనీశ్‌కుమార్‌ను నియమిస్తున్నట్లు కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ(ఏసీసీ) ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఎస్‌బీఐ ఛైర్మన్‌గా బాధ్యతలు వహిస్తున్న అరుంధతీ భట్టాచార్య పదవీకాలం శుక్రవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలోనే ఎస్‌బీఐకి కొత్త ఛైర్మన్‌ను ఎంపిక చేశారు. మూడేళ్ల పాటు కుమార్ ఎస్‌బీఐ ఛైర్మన్, మేనేజింగ్ డె%రెక్టర్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. అక్టోబర్ 7 నుంచి కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రస్తుతం కుమార్ ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. 1980లో ఆయన ఎస్‌బీఐలోకి అడుగుపెట్టారు. 2015లో ఎండీగా బాధ్యతలు చేపట్టారు.

2013లో ఎస్‌బీఐ తొలిసారిగా మహిళా ఛైర్మన్ అరుంధతీ భట్టాచార్యను నియమించింది. ఆమె పదవీ కాలం గతేడాది ముగిసినప్పటికీ.. మరో ఏడాది పాటు పొడిగించారు. ఆమె హయాంలోనే ఎస్‌బీఐలో ఐదు అసోసియేట్ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంకు విలీన ప్రక్రియ జరిగింది. ఈ విలీనంతో ప్రపంచంలోని టాప్ 50 బ్యాంకుల్లో ఎస్‌బీఐ ఒకటిగా నిలిచింది.

## హోటల్ చుట్టూ సీసీ కెమెరాలు పెట్టేశాడు



లాస్‌వెగాస్ : అమెరికాలోని లాస్‌వెగాస్‌లో మారణ హోమానికి పాల్పడి 59 మందిని పొట్టనబెట్టుకున్న నిందితుడు స్టీఫెన్ ప్యాడాక్ పక్కా ప్రణాళికతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. కాల్పులు జరపడానికి ముందు అతను మాండలే బే హోటల్ చుట్టూ ముందు జాగ్రత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినట్లు పోలీసులు వెల్లడించారు.

హోటల్‌లో పోలీసుల కదలికలు తెలుసుకోవడానికి ఈ కెమెరాలు పెట్టాడట. ముందుగా ప్లాన్ చేసుకుని పక్కాగా అమలు చేశాడని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనలో దాదాపు 500 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో చాలా మంది పరిస్థితి ఇప్పటికీ విషమంగానే ఉంది. అమెరికా చరిత్రలోనే ఇలాంటి దారుణ ఘటన ఇంతవరకు జరగలేదని పేర్కొన్నారు.

## కవి సమయం

### 'వితేక్షణ'

వితేక్షణ ఉంటే... ఉంటే;
విజయం నీదే... నీదేరా!
మత్తు వదలరా నిద్దుర మత్తు వదలరా!
మత్తులోన పడితే గమ్మత్తు గచితౌదూరా!
ముందు... ముందుకొస్తున్నాయి
పెద్ద పరీక్షలు
వేకువజామున లేచి చదువుకొమ్మురా!
అలా అన్నానని కంఠస్తా చెయికురా!
పరిజ్ఞానముతో చదువుకొమ్మురా!
లేకుంటే ఫస్టుక్లాస్ వాడివల్లా!
థర్డ్ క్లాస్ అయ్యేవురా! ...॥వితేక్షణ॥
చెట్టు కొమ్మపై ఆవలిబడ్డున ఉండి
కొమ్మను నరకకురా!
క్రిందపడి అంగవైకల్యుడు వౌదువురా!
ముందుకు దూసుకుపొమ్మని
శ్రీశ్రీ అన్నాడని ముందుకు పోకురా!
వెనుకై పోకుండా ఉండమని ...॥వితేక్షణ॥
మల్ల యుద్ధములో జరాసంధుడి తొడలు
విరిచిన బీమునకు అవి వ్యతిరేక చేయిమని
సూచనలు శ్రీ కృష్ణుడు ఎందుకిచ్చాడు
అలా చేస్తే జరాసంధుజ మరణిస్తాడని
గురువుల సూచనలు పాటిస్తే విజయం తథ్యమని ...॥వితేక్షణ॥
వితేక్షణ ఉంటే;
కురుక్షేత్ర సంగ్రామము జరిగేనా!
నిండు సభలో ద్రౌపతిని వస్త్రాభరణ
చేసే వాళ్లా కౌరవులు
వితేక్షణ ఉంటే;
అభలలపై యాసైడ్ దాడులు చేసేవాళ్లా!
ఉరిశిక్షలకు బలియైయేవాళ్లా! ...॥వితేక్షణ॥

...కవితా రచన
యల్.సిద్ధూ
సెల్ నెం : 7702977293

## పంచాంగం

మాసం : అశ్వీయుజ ; తిథి : పూర్ణిమ రా.11.59; ఉత్తరాభాద్ర రా.9.34; ఉ.వ.7.10ల 8.46. | గురువారం 05-10-2017

**మేషం** : ఖర్చులు అధికం. కోపతాపాలు అధికంగా వుంటాయి. స్త్రీలు తొందర పాటుతనం వల్ల ప్రియ తములను దూరం చేసు కుంటారు. యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు. **వృషభం** : దూర ప్రాంతాల నుంచి మంచి వార్తలు వింటారు. మీ ఉత్సాహాన్ని అదుపులో ఉంచుకోవటం శ్రేయస్కరం. వృత్తిపరమైన ఆటంకాలు క్రమంగా తొలగిపోగలవు. **మిథునం** : మిత్రులతో ఇష్టాగోష్టి చేస్తారు. తలపెట్టిన పనులు వేగవంత మవుతాయి. ప్రైవేటు, పత్రికా సంస్థల్లో వారికి మార్పులు వాయిదాపడతాయి. విదేశీ యత్నాలు వాయిదాపడతాయి. ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. భాగస్వామికుల మాటతీరు, కదలికలను ఎంతైనా మంచిది. బ్యాంక్ వ్యవహారాలలో మెళకవ వహించండి. **కర్కాటకం** : ఆరోగ్య విషయమై తగు జాగ్రత్త అవసరం. నరముల బలహీనత, మనోధైర్యం వలన అనుకున్న పనులు పూర్తి చేస్తారు. శారీరక శ్రమ, అకాల భోజనం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. **సింహం** : ప్రయాణ లాభం, ఆదాయానికి మించి ఖర్చులు చేస్తారు. శుభకార్యాలపై దృష్టి పెడతారు. మీ ఆలోచనలు ఫలిస్తాయి. **కన్య** : కార్యలాభం, గృహ లాభం, శుభకార్యలాభం, మిత్రుల సహాయ సహకారాలు లభించును. విందు, వినోదాలు, దూర ప్రయాణాలు చేస్తారు. **తుల** : చక్కని వ్యాపారాలు జరుగును. నూతన వస్తు, వస్త్ర లాభం, వాహన సౌఖ్యం కలుగును. చేయు వృత్తి వ్యాపారాలయందు అనుకూలత, దైవదర్శనం కలుగును. **వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు సంతృప్తిగా ఉండును. పాత రుణాలు వసూలు, శుభపరిణామాలు చోటుచేసు కుంటాయి. వ్యాపారాల్లో నిలదొక్కుకోవటానికి మరిం తగా శ్రమించవలసి ఉంటుంది. **ధనుస్సు** : బంధుమిత్రులతో విందు వినో దాల్లో పాల్గొంటారు. విద్యార్థులకు మిత్రబృందాల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కా రం ఉంది మెళకువ వహించండి. బ్యాంకు వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మీ కృషికి తగిన ప్రతిఫలం ఉంటుంది. స్త్రీలతో అతిగా సంభాషించటం వల్ల అపార్థాలకు గురికావలసి వస్తుంది. **మకరం** : వ్యవహారానుకూలత, నూతన కార్యాములకు శ్రీకారం చుడతారు. ధైర్యంగా ముందుకు వెళతారు. నూతన పరిచయాలు వలన లాభం కలుగును. పత్రికా సంస్థలలోని వారికి పనిభారం, విశ్రాంతి లోపం వంటి చికాకులు అధికం. నిర్మాణ పనులలో జాప్యం, అధిక వ్యయం వల్ల ఆందోళనకు గురవుతారు. రావలసిన ధనం వాయిదాపడుట వల్ల ఆందోళనకు గురవుతారు. **కుంభం** : వృత్తి వ్యాపారాలు అనుకూలించిననూ కోపం అధికం వలన అందరితోను విరోధాలు, మీ మాట లెక్కచేయకుండుట, శరీర అలసట, అధిక ధనవ్యయాలు, వృత్తి వ్యాపారాలు అనుకూలించిననూ కోపం అధికం వలన అందరితోను విరోధాలు కలుగును. **మీనం** :యశోభూషణ ప్రాప్తి, నూతన పరిచయాలు లాభించును. శుభమూలక ధనవ్యయం, విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆర్థిక లావాదేవీలు సంతృప్తి, ధైర్యంతో కూడిన పనులు చేస్తారు.

## సంకీర్తన

# శుభ ఫలితాలనిచ్చే సుబ్రమణ్యస్వామి



ఒకే శరీరంలో ఆరుముఖాలు పన్నెండు చేతులు గల కార్తికేయునికి సహాయకులుగా పార్వతిదేవి నూపురం నుంచి తొమ్మిది మంది వీరులు జనించారు. వీరబాహు, వీరకేసరి, వీర మహేంద్ర, వీర మహేశ్వర, వీర పురంధర, వీర రాక్షస, వీర మార్తాండ, వీరాంతక, వీర ధీర అని వారిని పిల్వడం జరుగుతోంది. విష్ణు ఆదేశం మేరకు శివుడు ఆ బాలుని నుంచి ప్రణవోపదేశం పొందాడు. ఆ కారణంగా సుబ్రహ్మణ్యేశ్వరుడికి, శివగురు, స్వామనాథ, దేశిక అనే పేర్లు వచ్చాయి. కుమారస్వామి ఇంద్రుని కుమార్తె అయిన దేవయానిని, శివమూర్తి కుమార్తె వల్లీదేవిని వివాహమాడాడు. అలాగే ఆ స్వామి నెమలిన తన వాహనంగానూ, కోడి పుంజును తన ధ్వజంగానూ చేసుకున్నాడు. ఆ కారణంగా స్వామి శిఖివాహనుడు, కుక్కుట ధ్వజుడయ్యాడు. సుమ్రహ్మణ్యేశ్వ రుడి ధ్వజమందు కోడి పుంజు ఉంటుంది. కో అనే ధ్వని ప్రణవమును సూచిస్తుంది. జ్ఞాన భానూదయము నకు ధ్వని సంకేతం. అలాగే స్వామి వాహనమైన నెమలి పురివిప్పి నర్తిం చునపుడు ఓంకార రూపంలో ఉంటుంది. ఆ కారణంగా స్వామిని ప్రణవ స్వరూపుడిగా చెబుతారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సేవించే సమయంలో ఉరగేశ్వ రాయనమః మహోరణాయనమః అని కీర్తించడం జరుగుతోంది. వల్లీదేవి స్వరూపంలో ఉన్నదని, స్వామి కూడా సర్ప రూపంలో ఉంటాడని పురాణాల ద్వారా అవగతమవుతోంది.తెలుగు రాష్ట్రాలలో సుబ్రహ్మణ్య షష్టి పర్వ దినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపు కుంటారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఈ పర్వదినం రోజున స్వామికి ఘనంగా పూజలు నిర్వహిస్తారు. సుబ్రహ్మణ్య షష్టిరోజున వేకువజామునే నిద్రలేచి తలంటు స్నానం చేస్తారు. అనంతరం సుబ్రహ్మ ణ్యేశ్వ రునికి సమర్పించడానికి చిలీ (నువ్వులు, బెల్లంతో కలగలిపినది) తయారుచేసి, కొబ్బరికాయలు, అరటిపళ్ళు, పాలు, కోడిగుడ్లతో బయలుదేరుతారు. సుబ్రహ్మణ్యే శ్వరుడు సర్పాకారుడు కావడం వల్ల సమీప ప్రాంతాలలో ఉన్న పుట్టలకు చేరుకుని పుట్టను శు ద్ధిచేసి, పసుపు, కుంకుమ బొట్లు, అందమైన ముగ్గులతో అలంకరిస్తారు. అనంతరం, పాలు కోడి గుడ్లను పుట్టలలోవేసి, ప్రసాదాలను, కొబ్బరి కాయలను నివేదిస్తారు. స్వామిని భక్తితో పూజిస్తూ, భజన గీతాలు, భక్తి పాటలతో కీర్తిస్తారు. అనంతరం పుట్ట మన్నును తమ చెవులకు రాసుకుంటారు. అలా చేయడంవల్ల తమకు చెవికి సంబం ధించిన వ్యాధులు దరిచేరవని నమ్ముతారు.అలాగే మహిళా భక్తులు, పుట్టలో పాలుపోసి, పుట్ట చుట్టూ భక్తి శ్రద్ధలతో ప్రదక్షిణలు చేస్తారు. సంతాన ప్రాప్తికోసం స్వామిని మనసావాచా ఆరాధిస్తారు. పిల్లలు, స్వామికి ప్రణామాలు అర్పించి మందుగుండు సామాను కాలుస్తారు. అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే సుబ్రహ్మణ్య ఆరాధన శక్తిని, ఐశ్వర్య మహాద్భాగ్యాలను కల్గిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఆ సుబ్రహ్మణ్యే శ్వరుని అపార కృపా రసామృతం అందరిమీదా వెల్లివిరియాలని మనసావాచా అందరూ పూజిస్తారు. శివపార్వతుల తనయుడైన కుమారస్వామి గంగాదేవి గర్భంలో పెరిగాడు. ఆమె భరించ లేకపోవడంతో, ఆ శిశువు రెల్లుపొదల్లో జారిపడింది. ఆ శిశువును కృత్తికా దేవతలు ఆరుగురు స్తన్యమిచ్చి పెంచారు. జారిపడినందున ఆ శిశువునకు స్కందుడని, రెల్లుగడ్డిలో ఆవిర్భవించడంతో శరవణుడని, కృత్తికా దేవతలు పెంచడంతో కార్తికేయుడని కుమారస్వామి అని పిలు స్తారు. ఇక సుబ్రహ్మ ణ్యునికి ఉన్న ఆరుముఖాలకు ప్రత్యేకతలు ఉన్నాయి. మయూర వాహనాన్ని అధిరోహించి కేళీ విలాసాన్ని ప్రదర్శించే ముఖం, పరమేశ్వరునితో జ్ఞానచర్చలు జరిపి ముఖం, శూరుడనే రాక్షసుని వదించిన స్వరూపానికి ఉన్న ముఖం, శరణు కోరిన వారిని సంరక్షించే ముఖం, శూలాయుధ పాణియై వీరుడిగా ప్రస్ఫు టమయ్యే ముఖం, లౌకిక సంపదల్ని అందించే ముఖం ఇలా ఆరు ముఖాల స్వామిగా ఆనందదాయ కుడిగా స్వామి కరుణామయుడిగా భక్తులచే నీరాజనాలు అందు కుంటున్నాడు. అందుచేత ఆషాడ మాస శుక్లపక్ష పంచమి, షష్టి పుణ్యదినాల్లో భక్తులు స్వామిని విశేషంగా సేవిస్తారు. వీటిని స్కందపంచమి, కుమార షష్టి పర్వదినాలు జరుపుకుంటారు. స్కంద పంచమి, షష్టి రోజుల్లో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే సకల సంపదలు, సుఖవంతమైన జీవితం చేకూరుతుందని పురో హితులు చెబుతున్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## సాగు విస్తరణ సేవలంటే ఇదేనా..?

చిత్తూరు : వ్యవసాయంలో ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం వ్యవసాయశాఖ అధ్వర్యంలో పాడి పంటలు పేరిట మాసపత్రికను ముద్రించి జిల్లా కేంద్రాలకు పంపుతోంది. జిల్లా కేంద్రం నుంచి మండలాలకు పంపి వ్యవసాయ, విస్తరణాధికారులతో రైతులకు అవగాహన కల్పించాలి. ఇందుకోసం ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తోంది. అయితే ఈ మాసపత్రిక రైతులకు చేరడం లేదు. ఆశించిన దిగుబడి చేతికి రాక రైతులు అపన్న హస్తం కోసం ఎదురు చూస్తుంటే..జిల్లా వ్యవసాయ శాఖ ఆధునిక సాగు విస్తరణ సేవలు అన్నదాతల అందించడంలో విఫలమయ్యింది. ప్రభుత్వం మహోన్నత లక్ష్యంతో జిల్లా కేంద్రానికి పాడి పంటల పుస్తకాలు పంపితే అవి వ్యవసాయశాఖ జిల్లా కార్యాలయంలోనో.. మండల కేంద్రాల్లోనో మగ్గిపోతున్నాయి. ఆగస్టు నెలలో వితరణ చేయాల్సిన అక్టోబరు నెల ప్రారంభమైనా జేడీ కార్యాలయం దాటలేదు. పాడి పంటలు మూటలు, బాక్సులకే పరిమితమయ్యాయి. అధికారులు వీటిని బయటకు తీసిన దాఖలాలు కూడా లేవు. అధికారులు నిర్లక్ష్యంతో ప్రజాధనం ఇలా వృధా అవుతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రతి నెల జిల్లా కార్యాలయానికి వచ్చిన పాడి పంటల సంచికలను సకాలంలో మండలాలకు పంపిణీ చేసి నూతన సాగు విస్తరణ పద్దతులపై అన్నదాతలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో 4జీ మొబైల్స్
## ప్రైవేటు సంస్థలకు దీటుగా రాయితీలు
### బీఎస్ఎన్ఎల్ జీఎం ఎం.ఎస్.ఏ.న్యూటన్



తిరుపతి : బీఎస్ఎన్ఎల్-మైక్రోమాక్స్ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో భారత్‌వన్ పేరుతో రూ.2,200కే 4జీ మొబైల్‌ను వినియోగదారులకు అందించనున్నట్లు బీఎస్ఎన్ఎల్ జీఎం ఎం. ఎస్.ఏ. న్యూటన్ తెలిపారు. తన కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ 18వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారులకు అందజేస్తున్న పలు రాయితీలను ఆయన వివరించారు. భారత్‌వన్ మొబైల్‌ను కొనుగోలు చేసిన వినియోగదారుడునెలకు రూ.97 రీఛార్జ్ చేసుకుంటే అపరిమిత కాల్స్, వాయిస్‌ను ఉచితంగా పొందవచ్చన్నారు. బీఎస్ఎన్ఎల్ ప్లాన్-429 ద్వారా 90 రోజల పాటు అపరిమిత కాల్స్‌తో బాటు, రోజుకు 1జీబీ డేటాను 3జీ వేగంతో వాడుకోవచ్చన్నారు. బీఎస్ఎన్ఎల్ రేట్ కట్టర్ వాయిస్ ఎస్టీవీ 19తో 90రోజులు, ఎస్టీవీ రూ.7తో 30రోజుల వ్యాలిడిటీ లభిస్తున్నట్లు తెలిపారు. బీఎస్ఎన్ఎల్ అసీమ్ ద్వారా వినియోగదారుల వర్చ్యువల్ ల్యాండ్ లైన్ నెంబర్‌ను సంవత్సరానికి రూ.99చెల్లించి, ఇతర నెట్ వర్క్‌లకు అయితే రూ.199 చెల్లించి వాడుకోవచ్చన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వందకు పైగా దేశాల్లో ఉన్న బీఎస్ఎన్ఎల్ వైఫై హాట్‌స్పాట్స్ ద్వారా అంతర్జాతీయంగా వినియోగదారులు రోమింగ్ లేకుండా నిర్ణీత ప్యాకేజీల ద్వారా అపరిమిత డేటాను వాడుకోవచ్చన్నారు. ఈ సదుపాయాన్ని మై బీఎస్ఎన్ఎల్ యాప్, పోర్టల్ ద్వారా పొందవచ్చునని తెలిపారు.

బీఎస్ఎన్ఎల్-మొబిక్విక్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ వ్యాలెట్ యాప్‌ను అందుబాటు లోకి తెచ్చామన్నారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ వ్యాలెట్ ద్వారా విద్యుత్ బిల్లులు, రీఛార్జ్‌లు, సూపర్‌మార్కెట్‌లు, పెట్రోల్‌బంక్ లలో లావాదేవీలను నిర్వహించుకోవచ్చన్నారు. తద్వారా క్యాష్‌బ్యాక్ ఆఫర్స్‌ను పొందవచ్చని చెప్పారు. బీఎస్ఎన్ఎల్ ఆప్టికల్ ఫైబర్ ద్వారా రూ.645కే 10 ఎంబీబీఎస్‌వేగంతో 50జీబీ, ఆపై 1ఎంబీపీఎస్‌తో అపరిమిత డేటాను, వాయిస్‌ను, రూ.1,045కు 20ఎంబీపీఎస్ వేగంతో 100జీబీ, ఆపై 2ఎంబీపీఎస్‌తో అపరిమిత డేటా, వాయిస్‌ను వినియోగించుకోవచ్చునని తెలిపారు. సమావేశంలో ఏజీఎం వెంకోబరావు తదితరులు పాల్గొన్నారు.

### అమీనాకు మెడికల్ ఎక్సలెన్స్ ధ్రువపత్రం

గుంటూరు : గుంటూరు వైద్య కళాశాల సామాజిక వైద్య శాస్త్రం విభాగం సహాయ ఆచార్యులు, జాతీయ సేవా పథకం సమన్వయకర్తగా పనిచేస్తున్న అమీనా సయ్యద్‌కు మెడికల్ ఎక్సలెన్స్ ధ్రువపత్రం దక్కింది. అమె చేస్తున్న సేవలను గుర్తించిన ఇండియన్ సాలిడారిటీ కౌన్సెల్ ఈ అవార్డుకు ఎంపిక జేసింది. గత నెల 27న దిల్లీలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో తమిళనాడు రాష్ట్ర మాజీ గవర్నరు భేష్ నారాయణ సింగ్ ఈ పురస్కారాన్ని అందజేసినట్లు ఆమె తెలిపారు. దిల్లీ నుంచి వచ్చిన అమీనాను కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాన ఆచార్యులు సుబ్బారావు, ఆ విభాగం అధిపతి నాగేశ్వరరావు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రైవేట్‌ట్రావెల్స్ సిబ్బంది నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి

రాజోలి : రాజోలి గ్రామంలోని 216 జాతీయ రహదారిపై బుధవారం కామాక్షి ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు సిబ్బంది నిర్లక్ష్యంతో రాజోలు గ్రామానికి చెందిన కాశీబట్ల శ్రీరామచంద్ర మూర్తి(75) అనే వ్యక్తి మృతి చెందాడు. రాజోలి ఎస్సై ఎస్.లక్ష్మణ రావు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి తాటిపాక వైపు వెళ్తున్న కామాక్షి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రాజోలి వచ్చేసరికి బస్సు డోర్ తెరుచుకోవడంతో రోడ్డుపై నడిచి వెళ్తున్న శ్రీరామ చంద్రమూర్తి తలకు బలంగా తగిలింది. దీంతో అతను కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు బస్సు సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చంద్రశేఖర్‌రావుకు రైతు నేస్తం పురస్కారం



తిరుపతి : శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం డీన్ టి.ఎస్.చంద్రశేఖర్‌రావుకు రైతు నేస్తం పురస్కారం దక్కింది. రైతు నేస్తం ఫౌండేషన్, స్వర్ణభారతీ ట్రస్టు సంయుక్తంగా కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలోని ఉత్కుర్‌లో నిర్వహించిన రైతు నేస్తం పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు విభాగంలోని విస్తరణ, శాస్త్రవేత్త, వ్యవసాయ పాత్రికేయుల విభాగంలో ప్రతి ఏటా రైతు విభాగం పురస్కారాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది శాస్త్రవేత్త విభాగంలో పశువైద్య విశ్వవిద్యాలయంలోని డీన్‌కు పురస్కారం దక్కింది. పురస్కారాన్ని భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రైతు నేస్తం వ్యవస్థాపకులు వేంకటేశ్వర్లు చేతుల మీదుగా అందుకున్నారు.

## పారిశుధ్యానికి ప్రతీకగా పాఠశాల

ఒప్పిచర్ల : స్వచ్ఛ విద్యాలయాల స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రతి పాఠశాల పారిశుధ్యానికి ప్రతీకగా నిలవాలని సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి గాదె రామకృష్ణారావు సూచించారు. మండలంలోని ఒప్పిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పాఠశాలలో నిర్వహిస్తున్న దస్త్రాలు, పాఠశాలలోని పరిసరాలు, మధ్యాహ్న భోజన వివరాలు సేకరించారు. ఈక్రమంలో విద్యతో బాటు క్రీడల్లో విద్యార్థులు రాణిస్తుండటంపై ఆయన హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసిన ఆయన శుచి శుభ్రతతో పాటు మధ్యాహ్న భోజన నిర్వహణలో మెనూ పాటించాలన్నారు. ఇదే క్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు తప్పని సరిగా గ్యాస్‌ను వినియోగించాలని, కట్టెల పొయ్యి ఎవరూ వాడవద్దని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వీరయ్య చౌదరి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## 10వ తేదీ పరీక్ష ఫీజు చెల్లింపుకు ఆఖరు

కడప : కడప డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ రీజనల్ కో-ఆర్డినేటర్ సెంటర్ పరిధిలో మొదటి, రెండో, మూడో సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్ష ఫీజు ఏపీ ఆన్‌లైన్‌లో చెల్లించడానికి ఆఖరు తేదీ అక్టోబరు 10వ తేదీగా నిర్ణయించినట్లు రీజనల్ కో-ఆర్డినేటర్, ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సుబ్బ నరసయ్య ప్రకటనలో పేర్కొన్నారు.

మూడో సంవత్సరం డిగ్రీ పరీక్షలు నవంబరు 6 నుంచి 11వ తేదీ వరకూ, రెండో సంవత్సరం డిగ్రీ పరీక్షలు నవంబరు 13 నుంచి 18వ తేదీ వరకూ, మొదటి సంవత్సరం డిగ్రీ పరీక్షలు నవంబరు 20 నుంచి 23వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

## జిల్లాలో 258 ప్రమాదకర రహదారులు
### జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న



తిరుపతి : జిల్లా రహదారుల్లో అత్యంత ప్రమాదకరంగా ఉండే 258 ప్రాంతాలను గుర్తించినట్లు జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల నివారణ, చెరువుల అభివృద్ధిపై ఆయన సమీక్షించారు. జిల్లాలో గుర్తించిన ప్రమాదకర ప్రాంతాలలో గ్రామ పంచాయతీ పరిధిలో 30, ఆర్‌అండ్‌బీ పరిధిలో 20ఉన్నాయన్నారు. మిగిలిన ప్రాంతాలను జాతీయ రహదారుల శాఖ పరిధిలో ఉన్నాయని చెప్పారు. వెంటనే ఈ ప్రాంతాల్లో వేగ నిరోధకాలు, లైటింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జాతీయ రహదారుల శాఖ సోలార్ బ్లింకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు జాతీయ రహదారుల్లో వేగ నిరోధకాలు వేయలేమని సూచించారు. అయితే ప్రమాదాల నియంత్రణలో సూచికలు ఏర్పాటు చేయాలని తెలియజేశారు. తిరుపతి పరిసరాల్లో 11 చెరువుల అభివృద్ధి నవంబర్ 15నాటికి పూర్తిచేయాలని ఇరిగేషన్, మున్సిపల్ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ చెరువులలో పూడికతీత పనులకు షార్ట్ టెండర్లను పిలవాలని సూచించారు. గుర్తించిన చెరువులలో వాకింగ్ ట్రాక్‌లు, సైకిల్ ట్రాక్‌లు, చెట్ల పెంపకం, పచ్చదనం కనిపించేలా చర్యలు చేపట్టాలన్నారు. కూర్చోవడానికి బల్లలు ఏర్పాట్లు తదితర ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. సమీక్షలో ఆర్‌అండ్‌బి ఎస్ఇ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## దుర్గిలో ప్రధాన రహదారికి మోక్షం
### రూ.28 లక్షలతో పనులు ప్రారంభం

దుర్గి : దుర్గిలో ఆర్‌అండ్‌బి రహదారి నుంచి గ్రామంలోని వెళ్లే ప్రధాన రహదారి ఏళ్ల క్రితం కొంతమేర సీసీరోడ్డుగా వేశారు. ఇపుడు అది అధ్వానంగా తయారై నడవాలన్నా, వాహనాలు వెళ్లాలన్నా ఇబ్బందిగా మారింది. వర్షం పడితే గుంతలు పడి వాహన చోదకులు కిందపడి గాయపడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి మూడు పనుల కింద రూ.28 లక్షలు మంజూరు చేయించారు. ఎంపీ రాయపాటి సాంబశివరావు నిధులు రూ.8 లక్షలు, ప్రత్యేక అభివృద్ధి కింద (ఎస్‌డీఎఫ్) ప్రభుత్వం ద్వారా తెదేపా నియోజకవర్గ బాధ్యుడు కొమ్మారెడ్డి చలమారెడ్డి ద్వారా రూ.10 లక్షలు, గ్యాప్ పిల్లింగ్ కింద రూ.10 లక్షలు మంజూరు అయినట్లు సర్పంచి నక్కనబోయిన చినవెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ ఏఈ ఆర్.సురేంద్ర తెలిపారు. ప్రస్తుతం రహదారి కాలువలపై ఆక్రమణలు ఉండటంతో గ్రామంలోకి ప్రవేశించే వాహనాలు రావడానికి ఇబ్బందిగా ఉంది. గ్రామస్థుల సహకారంతో వీటిని తొలగించే పనులు పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. వీధని వెడల్పు చేసి రెండువైపులా 6.5 అడుగులు వెడల్పు చేసి 13 అడుగులతో బస్టాండు కూడలి నుంచి గ్రామంలోకి 300 మీటర్ల పొడవు వరకు 7 అంగుళాల మందంతో సీసీ రోడ్డు వేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన రహదారి ప్రజలు, గ్రామ పెద్దలు సహకరించాలన్నారు. దీనిలో భాగంగా మంగళవారం ప్రధాన రహదారిపై ఉన్న ఆక్రమణలను జేసీబీతో తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. దీంతో గ్రామస్థులు హర్షం ప్రకటిస్తున్నారు.

## విధి విధానాలు మార్చొద్దు



భాస్కరపేట : గిరిజనుల జాబితాలో వాల్మీకీ, బోయ, వడ్డెర కులాలను చేర్చుతామని ప్రభుత్వం పదే పదే చెప్తోందని, ఇలా చేయడం గిరిజనుల మనోభావాలను దెబ్బతిసినట్లేనంటూ యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటయ్య అన్నారు. పట్టణంలోని గిరిజన సంక్షేమ సంఘం నేతలతో ఆయన సమావేశం అయ్యారు. అనాదిగా వస్తున్న గిరిజన విధి, విధానాలు, చట్టాలను మార్చేందుకు ఏ ప్రభుత్వానికి హక్కులేదన్నారు. ఈ విషయమై ఈ నెల 11న పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. గిరిజన సంఘాలన్నీ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీలు నాగరాణి, సులోచన, రవీంద్ర, యానాది సంఘం నేతలు బాలకృష్ణ, మోహన్, లోకయ్య తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంపై సభ్యుల మండిపాటు
### నూతన భవనంలో రాజమహేంద్రవరం నగరపాలిక తొలి కౌన్సిల్ సమావేశం

రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ పాలనపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రధానంగా అధికారుల నిర్లక్ష్యంపై పాలకవర్గం మండిపడింది. నగరంలో అభివృద్ధి మాట పక్కన పడితే సామాన్యునికి అందాల్సిన సేవలు పూర్తిగా విస్మరించారంటూ నేతలు మండిపడ్డారు. ఇలాగైతే ప్రజల్లో తిరగలేమని ప్రజాప్రతినిధులు తేల్చిచెప్పేశారు. అధికార, ప్రతిపక్షాలు కలిసి నగరంలో సమస్యలను ఎండగట్టారు. రోడ్లు, డ్రైనేజీ పనుల్లో నాణ్యతపై నిలదీశారు. గుత్తేదార్లు సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంపై ప్రశ్నించారు. వాటర్‌వర్క్స్ వద్ద తాగునీటి శుద్ధీకరణలో లోపాలను ఎత్తిచూపారు. సామాన్యుడు నగరపాలకసంస్థ కార్యాలయానికి వచ్చి తమ సమస్యను పరిష్కరించుకోలేని పరిస్థితి ఏర్పడిందంటూ ఆరోపించారు. మొత్తంగా ఒకపక్క అవినీతి, మరోపక్క నిర్లక్ష్యాన్ని ప్రస్తావించారు.

**అందరికీ మాట్లాడే అవకాశం**

రాజమహేంద్రవరం మేయర్ పంతం రజనీశేషసాయి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. నగరపాలకసంస్థ నూతన భవనంలో ఈ సమావేశం నిర్వహించారు. గతంలో కంటే భిన్నంగా ఈసారి సమావేశం జరిగింది. ముందుగా మేయర్ మాట్లాడారు. అనంతరం డివిజన్ల వారీగా సమస్యలపై మాట్లాడేందుకు కార్పొరేటర్లకు అవకాశం కల్పించారు. దీంతో సభ్యులు సమస్యలను ఏకరవు పెట్టారు. ఫలితంగా అధికారుల వ్యవహారశైలిపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రధానంగా తాగునీటి శుద్ధీకరణ విషయంలో వైకాపా ఫ్లోర్‌లీడర్ షర్మిళరెడ్డి, పలువురు కార్పొరేటర్లు ప్రస్తావించారు. శుద్ధీకరణకు కొత్త విధానాలు తీసుకువస్తామని సమాధానం ఇచ్చారు. ఫ్లోర్‌లీడర్ వర్రే శ్రీనివాసరావు మాట్లాడుతూ గుత్తేదార్లు సక్రమంగా పనులు నిర్వహించడం లేదని ఆరోపించారు. నగరంలో పార్కుల నిర్వహణ అధ్వానంగా ఉందని డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు అన్నారు. మహిళలకు డ్వాక్రా గ్రూపుల్లో రుణమాఫీ, ఇతర పథకాలకు సంబంధించి డబ్బులు జమ చేయడంలో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని కో-ఆప్షన్ సభ్యురాలు మజ్జి పద్మ విమర్శించారు. చివరిగా గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ శాఖల మధ్య సమన్వయం కొరవడిందన్నారు. నగరంలో ఆక్రమణలు తొలగించడంలోనూ, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. అధికారుల ఉదాసీనత వల్ల ఆశ్రయ రెసిడెన్సీ విషయంలో రూ.14 కోట్లు నష్టపోయామని సభ దృష్టికి తీసుకువచ్చారు. హైకోర్టులో కేసు నడుస్తుండగా, కార్పొరేషన్ నుంచి కౌంటర్ దాఖలు చేయక పోవడమే ఇందుకు కారణమన్నారు. ఇంజినీరింగ్, రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగాలు ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. నగర ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ మాట్లాడుతూ అధికారులు, పాలకవర్గం సమన్వయం అవసరమని తెలిపారు. నగర ప్రజల ఆరోగ్యంపై ఉదాసీనత తగదని మెరుగైన పారిశుద్ధ్యం, ఆరోగ్య కేంద్రాల నిర్వహణ సక్రమంగా అమలు జరగాలని సూచించారు. అనంతరం ప్రవేశ పెట్టిన ఎజెండాపై సుదీర్ఘంగా చర్చించి పలు అంశాలను ఆమోదించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, నగరపాలిక అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సీమ ప్రాజెక్టులపై సీఎంకు చిత్తశుద్ధి లేదు
### ధ్వజమెత్తిన వైకాపా నాయకులు

కడప : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి రాయలసీమ పట్ల మాటల్లో ఉన్న ప్రేమ చేతల్లో లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సమన్వయకర్త వైఎస్ వివేకానందరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి తదితరులు విమర్శించారు. వైకాపా జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీ అయిన వైకాపా రాయలసీమ జిల్లాలకు సాగునీటి పరంగా నష్టం జరిగేటట్లు ప్రసార మాధ్యమాల్లో, పత్రికల్లో ప్రచారం చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శిస్తున్నారన్నారు. ఆత్మరక్షణ ధోరణిలో ఆయన ప్రతిపక్షాలపై అర్థం లేని విమర్శలు చేస్తున్నారన్నారు. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 854 అడుగులకు చేరిన తర్వాత కూడా కడప జిల్లాలోని కెసి కెనాల్, తెలుగుగంగ, పైడిపాళెం జలాశయాలకు ఎందుకు నీటిని విడుదల చేయించలేదని ప్రశ్నించారు. తుంగభద్ర జలాలను నిల్వ చేసుకోవటానికి తగిన జలాశయాలు లేని కారణంగా ఆ నీరు కూడా శ్రీశైలం జలాశయంలోకే వెళుతోందన్నారు. సెప్టెంబర్ చివరికి తుంగభద్ర నీరు 27 టీఎంసీలు శ్రీశైలం జలాశయానికి చేరిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని కృష్ణా రివర్ బోర్డుకు తెలియజేసి పోతిరెడ్డి పాడు ద్వారా కేసీ కాలువకు నీటిని విడుదల చేయించాల్సి ఉందన్నారు. ఈ అంశంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తెచ్చి మిగులు జలాల మీదే ఆధారపడిన రాయలసీమకు నీటిని ఇవ్వాల్సిన ఆవశ్యకతను తెలంగాణ సర్కారుకు వివరించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. కానీ ఆయన ఆ బాధ్యతను విస్మరించి రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రంలోని ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తూ రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు.

రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయటంలో కూడా ముఖ్యమంత్రి ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని చెప్పారు. పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల సామర్థ్యాన్ని 14 వేల క్యూసెక్కుల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని చెప్పారు. ఈ అంశంపై అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో స్వపక్షం నుంచి విపక్షాల్లోని దేవినేని ఉమ వంటి నాయకుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చినా వైఎస్ఆర్ పోతిరెడ్డి పాడు సామర్థ్యాన్ని పెంచారన్నారు.

సీమలోని తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, వెలుగోడు ప్రాజెక్టులకు ఎన్టీ రామారావు రూపకల్పన చేయగా వైఎస్సార్ జలయజ్ఞంలో వాటిని దాదాపుగా పూర్తి చేశారని చెప్పారు. పైడిపాళెం ద్వారా పులివెందులకు నీటిని ఇవ్వాలన్న సంకల్పం వైఎస్సార్‌దేనని వారు స్పష్టం చేశారు. గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు దుమ్మగూడెం - నాగార్జున సాగర్ టైల్‌పాండ్‌కు 160 టీఎంసీలు తరలించి సీమ జిల్లాలతో బాటూ ప్రకాశం, నెల్లూరు, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మిగులు జలాల ఆధారంగా ఉన్న జలాశయాలకు నికర జలాలను ఇవ్వాలన్న ఆశయంతో వైఎస్సార్ పనిచేశారన్నారు. కార్యక్రమంలో కడప ఎమ్మెల్యే అంజాద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.




# సీజన్‌లో వేదించే జలుబు



వర్షాకాలంలో బాగా వేధించే సమస్య జలుబు, దగ్గు. ఏ వయసువారైనా వీటి బారిన పడకతప్పదు. ముఖ్యంగా వీటి కారణంగా పిల్లలు చాలా ఇబ్బంది పడతారు.దాదాపు రెండు వందల వైరస్‌లు కారణం. ఇన్నింటిలో ఏ ఒక్క వైరస్ వల్ల అయినా జలుబు రావచ్చు. అందుకని జలుబుకు సరైన మందు కనిపెట్టలేకపోయారు. విసిగించే జలుబు వల్ల మేలే ఎక్కువ ఉంది. వైరస్ శరీరంలోకి వెళ్లాక మనలోని వ్యాధి నిరోధక శక్తి వల్ల దానితో పోరాడటానికి యాంటీబాడీస్ తయారవుతాయి. ఇవి వ్యాధిని ఎదుర్కోవడానికి కావలసిన శక్తిని ఇస్తాయి. అందుకని జలుబు గురించి దిగులు చెందాల్సిన అవసరం లేదు. సాధారణంగా పుట్టిన నెల రోజుల వయసు నుంచే పిల్లలకు జలుబు రావడం మొదలవుతుంటుంది. మందులు వాడినా వాడకపోయినా ఏడు రోజుల్లో తగ్గిపోయే జలుబుకు ఎన్నో ఇతర కారణాలు ఉన్నాయి... ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి: జలుబు ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. పెద్దవాళ్లకు జలుబు ఉండి, పిల్లలకు దగ్గరగా లేదంటే వారి మీదనే దగ్గడం, తుమ్మడం చేస్తే వెంటనే అది పిల్లలకు వస్తుంది. వైరస్‌తో పాటు శుభ్రత లోపించడం దుమ్ము వల్ల కూడా జలుబు వస్తుంటుంది.

**ముక్కులో, గొంతులో** : ముక్కులో అడినాయిడ్స్, గొంతులో టాన్సిల్స్ ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు పిల్లలకు జలుబు ఎక్కువసార్లు వచ్చే అవకాశం ఉంది. అలాగే వీరిలో జలుబు తగ్గడానికి కూడా ఎక్కువ రోజులు పట్టవచ్చు. పెద్దలు ఎక్కడ పడితే అక్కడ ఉమ్మడం వల్ల, అందులో ఉండే వైరస్ ఎక్కడైనా వ్యాపిస్తుంది. ఇలాంటి చోట ఉండే పిల్లలను జలుబు ఎక్కువగా వేధిస్తుంది. ఉమ్మి ద్వారా టి.బి., స్వైన్‌ఫ్లూ వంటి దీర్ఘకాలిక జబ్బులు వచ్చే ప్రమాదమూ ఉంటుంది. తల్లిపాలు తాగని పిల్లల్లో తరచూ జలుబే కాదు ఏ ఇన్ఫెక్షన్ అయినా ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉంటాయి. **ఎలాంటి నిబంధనలు లేవు** : జలుబుకి ఆహారం విషయంలో ఎలాంటి నిబంధనలు లేవు. అయితే ముక్కులు మూసుకుపోవడం వల్ల పిల్లలు సరిగా తినలేరు. అందుకని తక్కువ తక్కువ ఆహారాన్ని వీలె%న్ని ఎక్కువసార్లు ఇస్తుండాలి. రెండు - మూడు గంటలకు ఓ సారి పాలిచ్చే తల్లులు పిల్లలకు జలుబు ఉన్నపుడు ఎక్కువ సార్లు ఇస్తుండాలి. పెద్దలు ఎక్కడ పడితే అక్కడ ఉమ్మడం వల్ల, అందులో ఉండే వైరస్ ఎక్కడైనా వ్యాపిస్తుంది. ఇలాంటి చోట ఉండే పిల్లలను జలుబు ఎక్కువగా వేధిస్తుంది. ఉమ్మి ద్వారా టి.బి., స్వైన్‌ఫ్లూ వంటి దీర్ఘకాలిక జబ్బులు వచ్చే ప్రమాదమూ ఉంటుంది. జలుబు తగ్గకపోగా పిల్లలు గాలి తీసుకునేటప్పుడు, వదిలేటప్పుడు పిల్లికూతలుగా వినిపిస్తుంటాయి. ఎన్నో కారణాల వల్ల వచ్చే ఈ సమస్య నియంత్రణకు బ్రాంకోడయలేటర్ మందులు, నెబులైజేషన్లు అవసరం పడతాయి.పిల్లల్లో సాధారణంగా రెండు నెలలకోసారి జలుబు వస్తూనే ఉంటుంది. ఎదుగుదలలో ఎలాంటి సమస్యలు లేనప్పుడు ఎక్కువ సార్లు జలుబు చేసినా భయపడాల్సిన అవసరం లేదు. మందులు అక్కరలేదు: జలుబుకు ప్రత్యేకించి మందులు వాడాల్సి అవసరం లేదు. ముక్కులు మూసుకుపోయినప్పుడు మాత్రం సెలె%న్ డ్రాప్స్, జ్వరంగా ఉంటే పారాసిటమాల్ సిరప్ వైద్యుల సలహా మేరకు వాడాలి. జలుబు ఏడు రోజులకు కూడా తగ్గక ఇంకా కొనసాగుతూ ఉంటే నిర్లక్ష్యం చేయకూడదు. యాంటీబయాటిక్స్ వాడనవసరం లేదు. అయితే డాక్టర్ సలహా మేరకు ఇవ్వాల్సి ఉంటుంది. జలుబుకు ప్రత్యేకించి వ్యాక్సిన్లు ఏమీ లేవు. అయితే పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరగడానికి, ఇతర వ్యాధులు రాకుండా ఉండటానికి సమయానుకూలంగా వ్యాక్సిన్లు ఇప్పించడం నిర్లక్ష్యం చేయకూడదు. **వంటింటి చిట్కాలు:** వెల్లుల్లిని బాగా నలగొట్టి గంటకొకసారి బాగా వాసన పీలుస్తూ, అప్పుడప్పుడు కొన్ని వెల్లుల్లి రెబ్బలు నమిలి మింగాలి. ఇలా చేస్తూ ఉంటే కూడా జలుబు తగ్గుతుంది. ఒక టేబుల్ స్పూన్ తేనెలో హాఫ్ టేబుల్ స్పూన్ దాల్చిన చెక్క పొడిని కలిపి పడుకునేటప్పుడు తాగితే జలుబు ,దగ్గు నుంచి కొంతవరకు ఉపశమనం పొందవచ్చు. 2 లేదా 3 తులసి ఆకులను వాటర్ తో కలిపి చిన్న మంటపై కొంత సేపు ఉడక బెట్టి.. నీళ్లు చల్లారాక పుక్కిలిస్తే గొంతు నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు.. తులసి, మిరియాలతో చేసే కషాయం జలుబు సమస్యను అదుపులో ఉంచుతుంది.

జలుబు, ముక్కుదిబ్బడ ఎక్కువగా ఉన్నప్పుడు కొద్దిగా యూకలిప్టస్ ఆయిల్‌ను చేతి రుమాలుపై వేసి వాసన పీలుస్తూ ఉంటే ముక్కుదిబ్బడ తగ్గుతుంది.

# హైబీపీ తగ్గించే కిస్‌మిస్

ఎండుద్రాక్షలో విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. యాంటీయాక్సిడెంట్లు, పీచు వంటివి రక్తహీనతను దరిచేరనివ్వవు. ఎండుద్రాక్షలకు జీర్ణక్రియను మెరుగుపరిచే శక్తి ఉంది. వీటిని క్రమం తప్పకుండా రోజుకు ఆరు లేదా ఐదింటిని తీసుకుంటే.. చిన్న పేగులోని వ్యర్థ పదార్థాలను సులభంగా వెలివేసినవారమవుతాం. ఎండుద్రాక్షల్లోని పీచు కడుపులోని నీటిని పీల్చేస్తుంది. తద్వారా విరేచనాలు వంటి ఉదర సంబంధిత రుగ్మతలను దూరం చేస్తుంది. ఇవి రక్త హీనతకు మంచి మందుగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా స్త్రీల కు ఇది ఎంతో ఉపయోగం. వీటిలో ప్రోటీన్లు, విటమిన్లు పుష్కలంగా ఉండటం ద్వారా బక్కపలచగా ఉన్నవారు తీసుకోవచ్చు. తద్వారా బరువు పెరుగుతారని న్యూట్రీషన్లు చెప్తున్నారు. క్రీడాకారులు తన శరీరానికి బలం చేకూర్చుకోవాలంటే.. ఎండుద్రాక్షల్ని తీసుకోవడం మంచిది. ఎండుద్రాక్షల్లోని ధాతువులు, కొలెస్టరాల్, విటమిన్లు, పీచు వంటివి శరీరానికి పోషకాలను అందిస్తాయి. వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. వీటిలోని యాంటీయాక్సిడెంట్లు క్యాన్సర్ కణాలను దూరం చేస్తాయి. హైబీపీని నివారిస్తాయి. గుండెను పదిలంగా ఉంచుతాయి. ఎండుద్రాక్షల్లో పొటాషియం రక్తనాళ్లాల్లో ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇంకా వీటిలో విటమిన్ బి కాంప్లెక్స్, ఐరన్ ఉండటం ద్వారా రక్తకణాల ఉత్పత్తికి ఎంతగానో ఉపకరిస్తాయి. ద్రాక్ష పండ్లను ఎండబెట్టినప్పుడు, ఎండు ద్రాక్ష తయారవుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తిఅయ్యే ద్రాక్షలో 80 శాతం పంటను వైన్ తయారీలో వాడుతారు. ఏడు శాతాన్ని ఎండు ద్రాక్షగా మలుస్తారు. మిగిలిన, శాతాన్ని మాత్రమే తాజాగా తినడానికి గాని జ్యూస్ తీసి వాడుకోవటానికి గాని వాడుతారు. మంచి పోషకాహార విలువలు కలిగి ఉం టాయి. కొన్ని రకాల వ్యాధులు సోకినప్పుడు ఇవి ఉత్తమ ఆహారంగా ఉపయోగ పడుతాయి



సంతానం లేని స్త్రీలు కిస్‌మిస్ పండ్లు తింటే అండా శయములోని లోపాలు తొలగి సంతానము కలుగుతుంది. మహిళలు ప్రతిరోజూ కిస్‌మిస్ పండ్లు తినుటవలన యూరినల్‌లో ఆమోనియా పెరగకుండా రాళ్ళు చేరకుండా కాపాడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

కిస్‌మిస్ పండ్లను తరుచుగా తినడం వలన శరీరములో పులుపును స్వీకరించే శక్తిగల ఆమ్లాలను సమానం చేసి జ్వరము రానీయకుండా చేస్తుంది. 200 మిల్లిగ్రాముల పాలతో 50 గ్రాముల కిస్‌మిస్ పండ్లు తినడం వలన నరాల నిస్సత్తువ, రక్తపోటు దీర్ఘకాల వ్యాధులు నయమవుతాయి. అలాగే రక్తం శుభ్రపడటానికి నరాలకు బలము చేకూరటానికి పది కిస్‌మిస్ పండ్లను నీళ్ళలోవేసి బాగా వుడకబెట్టి గుజ్జుగా వేసి తాగడం చేయాలని న్యూట్రీషన్లు సూచిస్తున్నారు. పిల్లలు రాత్రపూట పక్క తడుపుతుంటే వారికి వారంపాటు ప్రతిరోజూ రాత్రి రెండు ఎండు ద్రాక్ష పొలుకులను ఇవ్వండి. ఈ వారంలో వారికి చలవచేసే వస్తువులు, పెరుగు, మజ్జిగలాంటి పదార్థాలను ఇవ్వకండి. దీంతో పక్క తడిపే అలవాటునుంచి ఉపశమనం కలుగుతుంది. గొంతు వ్యాధితో బాధపడేవారు ఎండు ద్రాక్షను తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది.

ఎందుకంటే ఈ ఎండు ద్రాక్ష శరీరంలోని శ్వాసనాళికలో పేరుకుపోయిన కఫాన్ని తొలగిస్తుంది. దీంతో ఉపశనం కలుగుతుంది మలబద్ధకంతో బాధపడేవారు ప్రతిరోజూ రాత్రపూట పడుకునేముందు ఎండుద్రాక్షతోబాటు సోంపును కలిపి తీసుకుంటే మలబద్ధకంనుంచి ఉపశమనం కలుగుతుంది. ఎండు ద్రాక్షను బాగా వేడి చేసిన నీళ్ళలో నానబెట్టి తర్వాత పిల్లలకు ఇస్తే వారిలో జీర్ణశక్తి బాగా వృద్ధి అవుతుంది. కాకపోతే నానబెట్టే ముందు వీటిని పొడిగా చేయాల్సి ఉంటుంది.

# ఆలూతో పెరిగే అందం

రెండు చెంచాల బంగాళాదుంపరసంలో చెంచా నిమ్మరసం కలిపి కాసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. బయటకు తీశాక దూదితో ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని, పది నిమిషాలయ్యాక కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల మృతకణాలు తొలగిపోయి చర్మం శుభ్రపడుతుంది. ఛాయ మెరుగుపడుతుంది. మొటిమలూ, మచ్చలు ఏర్పడటం వంటి సమస్యలు దూరమవుతాయి.

ముల్తానీ మట్టిలో చెంచా బంగాళాదుంప గుజ్జు, నాలుగు చుక్కల రోజ్‌వాటర్ కలిపి ముఖానికి పూతలా రాసుకోవాలి. పావుగంట య్యాక గోరువెచ్చటి నీళ్లతో శుభ్రపరచుకోవాలి. తరవాత చన్నీళ్లలో తడిపిన వస్త్రంతో ముఖం తుడుచుకోవాలి. మర్నాటికి చర్మం తాజాగా తయారవుతుంది. బంగాళాదుంపను ఉడికించి మెత్తగా చేసుకోవాలి. అందులో కొంచెం పాలపొడి, బాదం నూనె చేర్చి ముఖానికి మర్దన చేసుకోవాలి. తరచూ ఇలా చేయడం వల్ల పొడిబారిన చర్మానికి తేమ అందుతుంది.



కళ్ల కింద నల్లమచ్చలు ఇబ్బంది పెడుతుంటే బంగాళాదుంపను ముక్కల్లా తరిగి కాసేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. తరవాత తీసి కళ్ల కింద రుద్దుకోవాలి. కొన్ని నిమిషాల పాటు కళ్ల మీద పెట్టుకోవాలి. ప్రతి రోజూ ఇలా చేస్తుంటే క్రమంగా నల్లమచ్చలు తగ్గుముఖం పడతాయి. నారింజ తొక్కల్ని అయిదు నిమిషాలపాటు ఉడకబెట్టి చల్లార్చాలి. చల్లారిన వాటితో మెడపైన, ముఖం మీద సుతిమెత్తగా రుద్ది అయిదు నిమిషాల తరవాత కడిగేయాలి. ఇలా వారంలో ఒక్కసారయినా చేస్తే చర్మం తాజాగా ఉంటుంది.

టీస్పూన్ తేనెలో కొద్దిగా కుంకుమపువ్వు కలిపి, ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకోవాలి. పదిహేను నిమిషాల తర్వాత చల్లని నీటితో శుభ్రపరచుకోవాలి. రోజూ ఇలా చేస్తుంటే నల్ల మచ్చలు తగ్గి, ముఖ కాంతి పెరుగుతుంది. రెండు చెంచాల పాలల్లో, బాదం పొడి, కలబంద గుజ్జు, తేనె కలిపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ మీద అప్లై చేసి అరగంటయ్యాక కడిగేసుకోవాలి. ఇలా చేస్తే ఈ కాలంలో వచ్చే చర్మ సమస్యలు దూరమవుతాయి. చర్మం పొడిబారకుండా కూడా ఉంటుంది.

# మీనాల్లాంటి 'కన్నుల' సంరక్షణ ఎలా..?

**వం**టగదిలో పనిలో ఉన్నప్పుడో లేదా ఇంటి పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడో కంట్లో నలుసు పడితే.. చేత్తో నలపటంకానీ, రుద్దటంకానీ చేయవద్దు. అలా చేస్తే చేతికి ఉండే మట్టి, ధూళికణాలు, సూక్ష్మక్రిములు కంట్లో చేరి అలెర్జీ, ఇన్‌ఫెక్షన్లను కలిగించే ప్రమాదం ఉంటుంది. కంట్లో నలకపడితే వెంటనే చేతులను శుభ్రం చేసుకుని చేతివేళ్లతో నీటిని కళ్లపై చిలకరించి మెత్తని, శుభ్రమైన గుడ్డతో కళ్లు తుడిస్తే సరిపోతుంది. కళ్లను రోజుకు వీలైనంత వరకు రెండుసార్లుకంటే ఎక్కువ కడుగకూడదు. కంటికి సరిపడా నిద్ర, విశ్రాంతి ఇవ్వడం చాలా అవసరం. కంటి అందాన్ని పెంచేందుకు వాడే వస్తువులు సాధ్యమైనంతవరకు కంపెనీ ఉత్పత్తులనే వాడాలి. కాటుక దిద్దిన కళ్లచూపు చాలా శృంగార భరితంగా ఉంటుంది. అయితే కాటుక పెట్టుకునేటప్పుడు చేతివేళ్లు శుభ్రంగా లేకపోతే క్రిములు కంట్లోకి ప్రవేశించి లోపలి భాగాలు దెబ్బతినే ప్రమాదముంది. అందువల్ల చేతులు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

కనురెప్పల వెంట్రులకు నలుపు రంగుతో సింగారిస్తే కళ్లు పెద్దవిగా చాలా అందంగా ఉంటుంది. కళ్లకు మంచి షేప్ రావడంకోసం ఐ లైనర్‌ను వాడతారు.

దీన్ని వాడేటప్పుడు కంట్లో చిన్న చుక్క కూడా పడకుండా ఉండేలా జాగ్రత్తపడాలి. కంటి మేకప్ అవసరం తీరిన తర్వాత తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండకపోతే కళ్లకు ప్రమాదం జరగవచ్చు. కొంతమంది మేకప్ తొలగించేందుకు దూదిని నీటిలో ముంచి శుభ్రం చేస్తుంటారు. ఇది సరైన పద్ధతికాదు. మేకప్‌ను తొలగించేందుకు తయారైన ప్రత్యేకమైన ఆయిల్‌ను మాత్రమే ఉపయోగించాలి లేదా బేబీ ఆయిల్ వాడాలి.

# కుడుములు తయారు చేయండిలా!



**కావాల్సిన పదార్థాలు:** రవ్వలా కొట్టిన బియ్యపు పిండి - రెండు కప్పులు, శనగపప్పు - అర కప్పు, నెయ్యి - ఒక స్పూన్, ఉప్పు, నీళ్లు - తగినంత.

**తయారుచేయు విధానం:** ముందుగా రాత్రిపూటే బియ్యం నానబెట్టుకొని తెల్లారాక మిక్సీలో రవ్వలా వేసుకోవాలి. అలాగే శెనగలను 15 నిమిషాలపాటు నానబెట్టుకోవాలి. తర్వాత స్టౌ మీద మందపాటి గిన్నె పెట్టి వేడయ్యాక, అందులో స్పూన్ నెయ్యి వేసి శనగపప్పును వేసి కొద్దిగా వేగనివ్వాలి. శనగపప్పు వేగాక వెంటనే నీళ్లు పోసి మరగనివ్వాలి. అందులో తగిన ఉప్పు వేసి, ఆ తర్వాత బియ్యపు పిండిని వేసి ఉండలు లేకుండా కలియబెట్టుకోవాలి. వెంటనే మూతపెట్టి 4-5 నిమిషాలు ఉక్కిరపట్టాలి. నీరంతా పిండి పీల్చేసుకున్నాక స్టౌ మీద నుంచి దించేసుకోవాలి. ఆ పిండితో నచ్చిన సైజులో ఉండలు చేసుకోవాలి. వీటిని ఇడ్లీ ప్లేట్లలో పెట్టి 25 నిమిషాలు ఆవిరిపై ఉడకనివ్వాలి. అంతే కుడుములు రెడీ.

# స్వీట్ కార్న్ రైస్

మొక్కజొన్న గింజలు ఒక మంచి బలమైన ఆహార పదార్థము. దీని గింజలను పచ్చిగా గాని, కాల్చుకొని లేదా ఉడకబెట్టుకొని తింటారు. మొక్కజొన్న గింజలనుండి పేలాలు 'పాప్ కార్న్', 'కార్న్ ఫ్లేక్స్' తయారుచేస్తారు. లేత 'బేబీకార్న్' జొన్న కంకులు కూరగా వండుకుంటారు. మొక్కజొన్న పిండితో రొట్టెలు చేసుకుంటారు. కొంచెం వెరైటీగా వెజిటేబుల్స్ చేర్చి పాప్‌కార్న్ రైస్ రుచి చూడండి. పిల్లలకు, పెద్దలకు ఇష్టమైన స్వీట్ కార్న్ రైస్ టేస్టీ మరియు ఆరోగ్యం కూడా.

**కావలసిన పదార్థాలు:** మొక్కజొన్న గింజలు - 2 కప్పులు, క్యారెట్ - పావు కప్పు (చిన్న ముక్కలుగా కట్‌చేసుకోవాలి), పచ్చిబఠాణి- అర కప్పు, ఉల్లిపాయ- 1 (చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి), అల్లం వెల్లుల్లి పేస్ట్ - 2 టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి - 4-6, నూనె - వేయించడానికి సరిపడా, జీలకర్ర - 1 టేబుల్ స్పూన్, పంచదార - 1 టేబుల్ స్పూన్, ఉప్పు - రుచికి తగినంత, భాస్మతి బియ్యం: 3 కప్పులు (ఉడికించిన అన్నం). జీడిపప్పు- 3 టేబుల్ స్పూన్లు, కిస్‌మిస్ - 2 టేబుల్ స్పూన్లు, కొబ్బరిపాలు - 3 కప్పులు.

**తయారుచేయు విధానం:** - బియ్యం కడిగి కొబ్బరి పాలలో అరగంట నానబెట్టిలి. తర్వాత కొబ్బరి పాలతో సహా బియ్యం వేసి అవసరమనుకుంటే కొద్దిగా నీళ్లు కలిపి మూతపెట్టి పది నిమిషాలు ఉడకనివ్వాలి. ఇప్పుడు



మూతతీసి ఉప్పు వేసి కలిపి, అన్నం ఉడికేంతవరకు ఉంచి స్టౌ కట్టేయాలి.

- తర్వాత పాన్‌లో నూనె వేసి వేడయ్యాక అందులో జీలకర్ర వేసి చిటపటలాడాక, అందులో ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించాలి.

- తర్వాత అందులో పంచదార వేసి కరగనివ్వాలి. తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి రెండు నిమిషాల పాటు తక్కువ మంటలో వేయించుకోవాలి.

- తర్వాత పచ్చిమిర్చి, క్యారెట్, పచ్చిబఠాణీ, స్వీట్ కార్న్ (మొక్కజొన్న గింజలు) ఒక దాని తర్వాత ఒకటి వేసి బాగా వేయించి కొద్దిసేపు మూతపెట్టి, ఆవిరి మీద ఉడికించుకోవాలి.

- తర్వాత మూత తీసి వెజిటేబుల్స్ ఉడికాయో లేదా చూసుకొని తర్వాత ఉడికించిన అన్నం అందులో కలుపుకొని బాగా మిక్స్ చేయాలి.

- చివరగా వేయించుకొన్న జీడిపప్పు, కిస్‌మిస్‌ను గార్నిష్ చేసి వేడివేడిగా సర్వ్ చేయాలి.

# చిత్రభాను

## డాక్టరేట్ అందుకున్న మోహన్‌బాబు



డైలాగ్ కింగ్ మోహన్‌బాబుకు ఎంజీఆర్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ అందించింది. బుధవారం చెన్నైలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ సి. విద్యాసాగర్‌రావు.. మోహన్‌బాబుకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోను మంచు విష్ణు సొంత నిర్మాణ సంస్థ 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. ఇది గర్వపడే సమయమని పేర్కొంది. ఇదే సందర్భంగా మంచు విష్ణు ట్విటర్‌లో ఆనందం వ్యక్తం చేశారు. ఎంజీఆర్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందిన నా హీరో, నా తండ్రికి శుభాకాంక్షలు అని ట్వీట్ చేశారు. తండ్రితో కలిసి దిగిన ఓ చక్కటి ఫొటోను పోస్ట్ చేశారు. చెన్నైకి సోదరుడు మంచు మనోజ్‌తో కలిసి వెళ్లి తన తండ్రిని సర్‌ప్రైజ్ చేసినట్లు మంచు లక్ష్మి ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా అక్కడ తీసిన ఫొటోలను పంచుకున్నారు.

నటుడిగా, నిర్మాతగా, రాజకీయవేత్తగా మోహన్‌బాబు అందరికీ సుపరిచితమే. ఆయన దాదాపు 560 చిత్రాల్లో నటించారు. రాజ్యసభ సభ్యుడిగానూ పనిచేశారు. ఆయన సేవను గుర్తించి భారత ప్రభుత్వం 2007లో పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది.

ప్రస్తుతం మోహన్‌బాబు గాయత్రి అనే చిత్రంలో నటిస్తున్నారు. మదన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి తమన్ స్వరాలు సమకూరుస్తున్నారు. మామ మంచు అల్లుడు కంచు తర్వాత ఆయన నటిస్తున్న చిత్రమిది.

## ఆమె కోసం రజనీ ఎన్ని వంటలు చేయించారో!



సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం కాలా. పా. రంజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. హ్యూమా ఖురేషీ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా ఈ సినిమా సెట్‌లో హ్యూమ కోసం రజనీ రకరకాల రుచికరమైన వంటలు చేయించారట. ఈ విషయాన్ని హ్యూమ ట్విటర్ ద్వారా తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. అన్ని రకాల వంటలను కలిపి తీసిన ఫొటోను పోస్ట్ చేశారు. కాలా ఉత్తమ టీమ్.. ఇంత మంచి ఆహారం ఏర్పాటు చేయించినందుకు ధన్యవాదాలు రజనీకాంత్ సర్ అని ఆమె ట్వీట్ చేశారు.

కాలాలో రజనీ గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. రజనీ భార్యగా ఈశ్వరీరావు నటిస్తున్నారు. నానా పటేకర్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. రజనీ అల్లుడు, హీరో ధనుష్ చిత్రానికి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మరోపక్క శంకర్ దర్శకత్వంలో తలైవా నటించిన 2.0 చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది.

## చరణ్ ఐటంసాంగ్‌లో పూజా హెగ్డే



రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'రంగస్థలం 1985' చిత్రంలో హీరోయిన్‌గా సమంత నటిస్తోంది. అయితే సుకుమార్ సినిమా అనగానే అందులో గ్యారంటీగా ఐటంసాంగ్ ఉంటుంది. ఐటంసాంగ్ లేకుండా సుకుమార్ సినిమాని ఊహించడం కూడా కష్టం. ఎప్పటిలానే సుకుమార్ ఈ చిత్రంలో కూడా ఓ బంపర్ ఐటం సాంగ్‌ని ప్లాన్ చేశాడని తాజాగా వార్తలు వచ్చాయి. అయితే ఈ ఐటంసాంగ్‌లో చరణ్ 'జంజీర్' చిత్రంలో హీరోయిన్‌గా చేసిన ప్రియాంకా చోప్రా నర్తించబోతోందని వార్తలు వినిపించాయి. ఆ తర్వాత ప్రియాంకా కాదు బాలీవుడ్‌కి చెందిన మరో భామ కరీనా కపూర్ ఈ సాంగ్‌లో చేయనుందని, దీని కోసం భారీ రెమ్యూనరేషన్ కూడా ఇచ్చారని కథనాలు వచ్చాయి. అయితే ఈ సాంగ్‌లో చరణ్‌తో జత కట్టబోతోన్న భామ గురించి అఫీషియల్‌గా సమాచారం వచ్చేసింది. ఇందులో ఎటువంటి బాలీవుడ్ హీరోయిన్ చేయడం లేదు. 'దువ్వాడ జగన్నాథమ్' చిత్రంలో అల్లు అర్జున్ సరసన హీరోయిన్‌గా నటించిన పూజా హెగ్డే ఈ ఐటంసాంగ్‌లో చేయబోతోన్నట్లుగా చిత్ర యూనిట్ అఫీషియల్‌గా తెలియజేసింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు ఈ విషయాన్ని తమ ట్వీట్టర్ పేజ్‌లో తెలియజేశారు. అల్లు అర్జున్‌తో సక్సెస్ ట్రాక్‌లోకి వచ్చిన పూజా.. ఈ ఐటం సాంగ్‌తో మెగా హీరోయిన్‌గా మెగా ఫ్యాన్స్‌కి మరింత చేరువకానుందన్నమాట.

## ప్రకాశ్‌రాజ్‌పై కేసు నమోదు

ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్‌పై కేసు నమోదైంది. ప్రధాని పై ప్రకాశ్‌రాజ్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఉత్తర్రపదేశ్ రాజధాని లఖ్‌నవూకు చెందిన ఓ న్యాయవాది ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అక్టోబరు 7న ఈ కేసుకు సంబంధించిన వాదోపవాదాలను కోర్టు విననుంది.

బెంగళూరులో రెండు రోజుల క్రితం ప్రకాశ్‌రాజ్ మీడియాతో మాట్లాడారు. కేంద్రం వె%ఖరిని నిరసిస్తున్నట్టు తెలిపారు. పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ హత్య విషయంలో కేంద్రం వె%ఖరి బాధ కలిగించిందని చెప్పారు. ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ లఖ్‌నవూకు చెందిన న్యాయవాది కేసు పెట్టారు.



## విలన్‌గా వస్తాడట!



లాహిరి లాహిరి లాహిరిలో' చిత్రంతో పరిచయమై దాదాపు 30 చిత్రాల్లో నటించిన ఆదిత్య ఓం ఆ తరువాత తెరమరుగయ్యాడు. అయితే ఆదిత్య ఓం నటించి, దర్శకత్వం వహించిన 'ఫ్రెండ్ రిక్వెస్ట్' గత సంవత్సరం విడుదలైంది ఈ సినిమా ఎప్పుడు వచ్చిందో ఎప్పుడు వెళ్లిందో కూడా ఎవరికీ తెలియదు. దీంతో ఇప్పుడు ఆదిత్య ఓం విలన్ పాత్రలు, విలక్షణ పాత్రలు పోషించేందుకు సిద్ధమయ్యారు.

అక్టోబర్ 5 ఆదిత్య ఓం పుట్టినరోజు సందర్భంగా ఈ సరికొత్త నిర్ణయం తీసుకున్నానని, ఈ విషయంలో తనకు సీనియర్ నటులైన జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్‌లను ఆదర్శంగా తీసుకున్నట్టు తెలిపారు. హీరోగా ఒకటిన్నర దశాబ్దంగా తనను ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు సదా కృతజ్ఞుడనై వుంటానని, ఇకపై విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకం తనకు వుందని ఆదిత్య ఓం తెలిపారు.

## 3ఘాజీ దర్శకుడికి మెగా ఆఫర్!





అతి తక్కువ బడ్జెట్‌లో 'ఘాజీ' వంటి సినిమాను తెరకెక్కించి ఇండస్ట్రీలో ఒక్కసారిగా పాపులర్ అయ్యాడు దర్శకుడు సంకల్ప్ రెడ్డి. ఈ సినిమాకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. ఇలాంటి ఒక కథను ప్రేక్షలకు నచ్చే విధంగా తెరపై ఆవిష్కరించి సంకల్ప్ తన దర్శకత్వ ప్రతిభను చాటాడు. అయితే ఇప్పటివరకు సంకల్ప్ తన తదుపరి ప్రాజెక్ట్ ఏంటనే విషయంలో క్లారిటీ ఇవ్వలేదు. వైవిధ్యమైన సినిమాల్లో నటించే వరుణ్ తేజ్ హీరోగా సంకల్ప్ ఓ సినిమా చేయనున్నాడనే వార్తలు వినిపించాయి. తాజాగా వరుణ్ ఈ ప్రాజెక్ట్ చేయడానికి అంగీకరించాడని సమాచారం. ఈ క్రేజీ ప్రాజెక్ట్ మూవీకి నిర్మాతగా పీవీపీ వ్యవహరించనున్నారని తెలుస్తోంది. 'ఘాజీ' సినిమాను కూడా పి.వి.పి నిర్మించిన సంగతి తెలిసిందే. మరో రెండు, మూడు రోజుల్లో ఈ సినిమాకు సంబంధించిన అధికార ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే సంకల్ప్ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు కూడా మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. వరుణ్ తేజ్ ప్రస్తుతం వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమాకు 'తొలిప్రేమ' అనే టైటిల్ అనుకుంటున్నట్లు టాక్. ఈ సినిమా షూటింగ్ పూర్తయిన తరువాత వరుణ్.. సంకల్ప్ ప్రాజెక్ట్‌లో జాయిన్ అవుతాడు.

## ఆ సైట్లపై మా ఫిర్యాదు సైబర్ సెల్‌లో కేసు నమోదు

మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) ఇచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర సీఐడీ సైబర్ సెల్ కేసు నమోదు చేసింది. ఐటీ చట్టం ప్రకారం సెక్షన్ 67, 67(ఎ)ల కింద పలు వెబ్‌సైట్లపై కేసు నమోదు చేసినట్లు సైబర్ సెల్ ఎస్పీ రామ్మోహన్‌రావు తెలిపారు. ప్రధానంగా సినిమా రంగానికి చెందిన కొందరి ప్రతిష్ఠను దిగజారేటట్లు అశ్లీల చిత్రాలను, దృశ్యాలను కొన్ని వెబ్‌సైట్లు అప్‌లోడ్ చేస్తున్నాయని మా ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

బూతు కథనాలు, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, కొందరి ముఖాలను మార్ఫింగ్ చేసి అశ్లీల దృశ్యాలను అప్‌లోడ్ చేస్తున్న వెబ్‌సైట్ల నిర్వాహకులుపై చర్యలు తీసుకుంటామన్నారు. వారు ఎక్కడ ఉన్నా చట్టపరమైన చర్యలు తీసుకుని అరెస్ట్ చేస్తామని చెప్పారు. ఒకవేళ బయట దేశాల్లో ఉన్నట్లయితే సంబంధిత వెబ్‌సైట్లను బ్లాక్ చేస్తామని తెలిపారు.

MAA
MOVIE ARTISTES' ASSOCIATION

## ఇక 'సై..రా' బాధ్యత ఉపాసనదే!

చాలా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న చిరంజీవి 151వ చిత్రం సై..రా నరసింహారెడ్డి. ఈ సినిమా ఫస్ట్ లుక్ రిలీజ్‌తోనే ఆగిపోయింది. చిరు బర్త్‌డే సందర్భంగా ఫస్ట్ లుక్ రిలీజ్ అయింది అంతే.. నాటి నుంచి సెట్స్‌పైకి వెళ్లలేదు. షూటింగ్‌కి సంబంధించిన సెట్టింగ్స్ మాత్రం వేస్తున్నారు..

కానీ షూటింగ్‌కి మాత్రం ముహూర్తం కుదరట్లేదు. సెప్టెంబర్‌లోనే జరుగుతుందని భావించినప్పటికీ కొన్ని కారణాల వల్ల అక్టోబర్‌కి మారింది. దీనికి కారణం.. రామ్ చరణ్ రంగస్థలం సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటమేనని తెలుస్తోంది. ఇప్పటికీ చెర్రీకి సై..రా షూటింగ్ కోసం సమయం కేటాయించలేక పోవడంతో నిర్మాణ బాధ్యతలను తన భార్య ఉపాసనకు అప్పగించినట్టు తెలుస్తోంది. ఆల్రెడీ ఆమె అపోలో హాస్పిటల్ వ్యవహారాలు, రామ్ చరణ్ ట్రూ జెట్ ఎయిర్ లైన్స్‌కి సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు.

వీటికి తోడు సై..రా సినిమా బాధ్యతను కూడా తన భుజాన వేసుకోనున్నట్టు సమాచారం.

# ప్రజల చెంతకు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు



గుంటూరు: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అందరికీ సమానంగా అందించే క్రమంలో అధికారులు ఇకపై క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకరరావు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఛాంబర్‌లో కార్యాలయ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ షెడ్యూల్ కులాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2713 కోట్లు కేటాయించిందన్నారు.

కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో ప్రజలకు అందేలా అన్ని జిల్లాల్లోనూ అధికారులతో సమీక్షను నిర్వహిస్తున్నామన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కార్పొరేషన్ వివిధ సంక్షేమ పథకాల కింద రూ.308 కోట్ల వరకు నిధులు మంజూరయ్యాయని, వాటిని సకాలంలో లబ్ధిదారులకు ఉపయోగపడే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు రుణాలు అందజేయటంలో బ్యాంకులు ఇబ్బందులు పెడుతున్నాయనే విషయంపై లబ్ధిదారులు, కార్పొరేషన్ అధికారులను కలుపుకుని బ్యాంకుల వద్ద ధర్నా చేపడతామని పేర్కొన్నారు.

దళితులను ఆర్థికంగా పైకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను దళితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజీనాయక్, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సాఫ్ట్‌బాల్ పోటీల్లో జయభేరి మోగించాలి

- పురుషుల, మహిళల జట్లకు క్రీడాదుస్తులు పంపిణీ
- ఆర్డీటీ క్రీడా సంచాలకులు నిర్మల్‌కుమార్

అనంతపురం : కేరళలో జరగనున్న దక్షిణ భారతస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్లు ఛాంపియన్లుగా సగర్వంగా తిరిగి రావాలని ఆర్డీటీ క్రీడా సంచాలకులు నిర్మల్‌కుమార్ పిలుపు నిచ్చారు.

దక్షిణ భారతంలో మన రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడానికి ప్రతి క్రీడాకారుడు సత్తాచాటాలన్నారు. అనంత క్రీడాగ్రామంలో ఆంధ్ర పురుషుల, మహిళల జట్లకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. దక్షిణ భారతస్థాయిలో జరిగే సాఫ్ట్‌బాల్ పోటీల్లో గెలవాలంటే రెట్టింపు ఉత్సాహంతో ఆడాలని పిలుపునిచ్చారు.

సాఫ్ట్‌బాల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశులు మాట్లాడుతూ ఆర్డీటీ అందిస్తున్న ప్రోత్సాహం మరువలేమన్నారు. క్రీడాగ్రామం మేనేజరు సురేంద్ర పాల్గొన్నారు.

# కాస్త జోరు తగ్గినా.. లాభాలే..




ముంబయి: వరుసగా రెండో రోజు స్టాక్‌మార్కెట్లు లాభాల్లో పయనించాయి. ఆర్‌బీఐ విధాన పరపతి సమీక్ష నేపథ్యంలో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. దీంతో ఆరంభం నుంచే లాభాల జోరు సాగించాయి. అయితే వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ రిజర్వ్ బ్యాంక్ నిర్ణయం తీసుకుంది. దీంతో సూచీలు కాస్త జోరు తగ్గించినప్పటికీ.. చివరకు లాభాలను దక్కించుకున్నాయి. సెన్సెక్స్ 170 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ మాత్రం 9,920 మార్క్‌ను దాటలేకపోయింది. ఈ ఉదయం 23 పాయింట్ల స్వల్ప లాభంతో 31,520 వద్ద ట్రేడింగ్ ఆరంభించిన సెన్సెక్స్.. కొనుగోళ్ల మద్దతుతో మధ్యాహ్నానికి భారీ లాభాల దిశగా దూసుకెళ్లింది. ఒకానొక దశలో 200 పాయింట్లకు పైగా ఎగబాకింది. అయితే ఆర్‌బీఐ నిర్ణయం తర్వాత కాస్త నెమ్మదించిన సూచీ.. చివరకు 174 పాయింట్లు లాభపడి 31,672 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 55 పాయింట్ల లాభంతో 9,915 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ. 65.00గా కొనసాగుతోంది.

# భారత అణు జలాంతర్గామికి ప్రమాదం



న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ చక్ర ప్రమాదానికి గురైంది. సముద్రంలో ఏదైనా నౌకను ఢీకొనడం వల్లగానీ, లేకపోతే విశాఖలోని షిప్‌యార్డ్‌లోకి ప్రవేశించే సమయంలో తుక్కును ఢీకొనడం వల్లగానీ ఈ ప్రమాదం జరిగి ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై నావికాదళ అధికారులు స్పందించలేదు.

***కఠినమైన లోహంతో తయారీ..***

ఈ జలాంతర్గామిని రష్యా నుంచి 10 ఏళ్ల లీజుకు తీసుకున్నారు. ప్రస్తుతం జరిగిన ప్రమాదంలో జలాంతర్గామి ముందు భాగంలోని టార్పెడో ట్యూబ్ కింద ఉండే సోనార్ డోమ్ దెబ్బతింది. టైటానియం అనే కఠినమైన లోహంతో దీన్ని తయారు చేస్తారు. దీంతో ఈ భాగం తయారీకి ప్రత్యేక మైన యంత్రాలు, నిపుణులు కావాలి. దీనికి విశాఖ పట్టణంలోనే మరమ్మతులు చేయనున్నారు. పూర్తి దేశీయ పరిజ్ఞానంతో తయారైన ఐఎన్ఎస్ అరిహంత్ జలాంతర్గామిని కూడా విశాఖలోనే తయారు చేశారు.

***నిశ్శబ్ద యోధుడు..***

2012లో భారత నావికాదళంలో ప్రవేశించిన ఐఎన్ఎస్ చక్ర చాలా కీలకమైంది. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన సబ్‌మెరైన్లలో ఇది కూడా ఒకటి. రష్యాకు చెందిన అకులా-2 శ్రేణి సబ్‌మెరైన్ల అప్‌గ్రేడ్ వెర్షన్‌ను భారత్ లీజుకు తీసుకుంది.

ఇది కేవలం అణుశక్తితో పనిచేస్తుంది. దీనిలో అణ్వస్త్రాలు ఉండవు. కానీ అత్యంత రహస్యంగా ప్రయాణించి శత్రునౌకలను ముంచివేయడంతో పాటు భూమిపై లక్ష్యాలనూ ఛేదిస్తుంది. ప్రపంచంలో ఇటువంటివి కేవలం అమెరికా, రష్యా దగ్గర మాత్రమే ఉన్నాయి.

# క్రీజ్‌లోకి మహిళా అంపైర్..!



న్యూఢిల్లీ : మైదానంలోకి మహిళా అంపైర్లు రాబోతున్నారు. వారు కేవలం మహిళలు ఆడే క్రికెట్ మ్యాచ్‌లకే పరిమితం కాకుండా.. పురుషుల మ్యాచ్లకి కూడా అంపైరింగ్ చేయబోతున్నారు. తాజాగా ఆస్ట్రేలియాకి చెందిన మహిళా అంపైర్ పొలోసాక్ ఓ పురుషుల మ్యాచ్‌కి అంపైరింగ్ చేసి అరుదైన ఘనతని అందుకుంది. 29 ఏళ్ల పొలోసాక్.. ఆస్ట్రేలియా ఎలెవన్, న్యూ సౌత్ వేల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌కి అంపైర్‌గా పనిచేసింది. పురుషుల ఫస్ట్‌క్లాస్ స్థాయి మ్యాచ్‌ల్లో ఒక మహిళ అంపైర్‌గా పనిచేయడం క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి.

నేను ఎప్పుడూ క్రికెట్ ఆడలేదు. కానీ.. మ్యాచ్‌లు చూస్తుండేదాన్ని. ఈ ఆసక్తిని గమనించిన మా నాన్న నన్ను ఓ అంపైర్ కోర్సులో చేర్చారు. పురుషుల ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌కి అంపైరింగ్ చేసే అవకాశం రావడం గొప్పగా భావిస్తున్నాను. ఈ రంగంలో నేను మెరుగ్గా రాణించగలిగితే.. మరి కొంత మందికి మార్గదర్శకంగా ఉంటుంది అని పొలోసాక్ వివరించింది. అతి తక్కువ కాలంలోనే ఎలైట్ లెవల్ స్థాయికి పొలోసాక్ చేరుకోగలిగిందని.. ఇదే ప్రతిభని కొనసాగిస్తే పురుషుల అంతర్జాతీయ మ్యాచ్‌లకి కూడా ఆమె అంపైరింగ్ చేయగలదని క్రికెట్ ఆస్ట్రేలియా సీఈవో ధీమా వ్యక్తం చేశారు.

# వడ్డీరేట్లు యథాతథం

## ఆర్‌బీఐ ప్రకటన




ఢిల్లీ: విశ్లేషకుల అంచనాలే నిజమయ్యాయి. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) బుధవారం ప్రకటించింది. ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆధ్వర్యంలోని పరపతి విధాన కమిటీ సమావేశం జరిగింది. ఇందులో రెపోరేటు యథాతథంగా ఆరు శాతం కొనసాగించాలని కమిటీ నిర్ణయించింది. రివర్స్ రెపో రేటు, సీఆర్ఆర్‌లలో కూడా ఎలాంటి మార్పులు చేయకుండా 5.75శాతం, 4శాతంగా ఉంచారు. అయితే ఎస్ఎల్ఆర్‌ను మాత్రం 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 19.5శాతం చేశారు.

కాగా.. 2017-18 సంవత్సరంలో వృద్ధిరేటు మరింత తగ్గుతుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. తొలుత వృద్ధిరేటు 7.3శాతంగా ఉంటుందని అంచనా వేసిన రిజర్వ్‌బ్యాంకు తాజాగ దాన్ని 6.7శాతానికి సవరించింది. అయితే ద్రవ్యోల్బణం మాత్రం 4.2 నుంచి 4.6శాతంగా ఉంటుందని అంచనా వేసింది.

# వెండితెరపై ఇస్రో మాజీ ఛైర్మన్ జీవితం

ముంబయి: ఇస్రో మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణన్ జీవితం వెండితెరపై రాబోతోంది. బాలీవుడ్ దర్శకుడు నిఖిల్ అడ్వాణీ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఓసారి ప్రధాని నరేంద్రమోదీ మాంగళ్ యాన్ మిషన్ బృందంతో కలిసి దిగిన ఫొటోను దర్శకుడు నిఖిల్ చూశారట. ఆ ఫొటో నచ్చి రాధాకృష్ణన్ గురించి మరింత తెలుసుకోవాలన్న ఆసక్తి కలిగింది. దీంతో రాధాకృష్ణన్ రాసిన మై ఒడిస్సీ పుస్తకం చదివారట.

దాని నుంచి స్ఫూర్తి పొంది ఈ సినిమా తీయాలనుకున్నానని నిఖిల్ తెలిపారు. ఈ సినిమా విషయమై రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. ఓ కుగ్రామం నుంచి వచ్చిన తాను చిన్నప్పుడు ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నానని నేటి యువత తనను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.

మేలుకో వినియోగదారుడా మేలుకో

వస్తువులు మరియు సేవల పన్ను

1 దేశం పన్ను మార్కెటు



**సర్వ సాధారణంగా ఉపయోగించే ఐటమ్‌లకు తక్కువ జీఎస్‌టి వర్తిస్తుంది**

క్రింది పేర్కొన్న వస్తువులపై జిఎస్‌టి క్రింద వర్తించు పన్ను జిఎస్‌టికు ముందు గల పరోక్ష పన్నుల కంటె తక్కువ.

ఇంతకుముందు పరోక్ష పన్నులు VS. జిఎస్‌టి రేటు

| వస్తువు వివరణ | జిఎస్‌టికు ముందు వర్తించేది | జిఎస్‌టి రేటు | వస్తువు వివరణ | జిఎస్‌టికు ముందు వర్తించేది | జిఎస్‌టి రేటు | వస్తువు వివరణ | జిఎస్‌టికు ముందు వర్తించేది | జిఎస్‌టి రేటు |
|---|---|---|---|---|---|---|---|---|
| గోధుమ | 2.5% | 0% | ఆర్ఎస్‌పి జత రూ. 500 వరకు పాదరక్షలు | 10% | 5% | తీపి ఆహార పదార్థములు | 21% | 18% |
| బియ్యం | 2.5% | 0% | బొగ్గు | 9% | 5% | సబ్బు | 27% | 18% |
| బ్రాండ్ కాని పిండి | 3.5% | 0% | కెచప్ & సాస్‌లు | 12% | 12% | ఆర్ఎస్‌పి జత రూ. 500 పైబడిన పాదరక్షలు | 21% | 18% |
| పెరుగు, లస్సీ, మజ్జిగ | 4% | 0% | ఆవాల సాస్ | 12% | 12% | ఎల్‌పిజి స్టవ్ | 21% | 18% |
| బ్రాండ్ లేని సహజ తేనే | 6% | 0% | టాపింగ్‌లు, స్ప్రెడ్లు & సాస్‌లు (మయోన్నైస్, సలాడ్ డ్రెస్సింగ్‌లు, మిక్స్‌డ్ మసాలాలు మరియు మిక్స్‌డ్ సీజనింగ్‌లు కాక ఇతరములు) | 12% | 12% | అల్యూమినియం ఫాయిల్స్ | 19% | 18% |
| పిల్లల చిత్రాలు, చిత్ర లేఖనం & రంగుల పుస్తకాలు | 7% | 0% | పళ్ళపొడి | 17% | 12% | స్కూలు బ్యాగ్ | 22% | 18% |
| అల్ట్రా హై టెంపరేజర్ (యుహెచ్‌టి) పాలు | 6% | 5% | ఎల్ఇడి | 15% | 12% | ప్రింటర్లు (బహుళ ప్రయోజన ప్రింటర్లు కాక ఇతరములు) | 19% | 18% |
| తేయాకు (ప్రాసెస్ చేయబడని తేయాకులు కాక ఇతరములు) | 6% | 5% | వైద్యవసరాలకై ఎక్స్‌రే ఫిల్మ్‌లు | 23% | 12% | స్టాప్లర్లు | 27% | 18% |
| పాలపిండి | 6% | 5% | రోగ నిర్ధారణ కిట్‌లు మరియు ఏజెంట్‌లు | 16% | 12% | హెల్మెట్ | 20% | 18% |
| పంచదార | 6% | 5% | ఫ్లై యాష్ ఇటుకలు & ఫ్లైయాష్ బ్లాకులు | 16% | 12% | బేబి క్యారేజ్‌లు | 27% | 18% |
| తీపి ఆహార పదార్థములు | 7% | 5% | కుట్టు మిషన్లు | 16% | 12% | ప్లాస్టిక్ టార్పాలిన్ | 19% | 18% |
| వెజిటేబుల్ నూనెలు | 6% | 5% | తల నూనె | 27% | 18% | వెదురు ఫర్నీచరు | 23% | 18% |
| సుగంధ ద్రవ్యాలు | 6% | 5% | టూత్‌పేస్ట్ | 27% | 18% | హెడ్‌గేర్ మరియు భాగాలు | 27% | 18% |
| కిరోసిన్ ప్రెజర్ లాంతరు | 8% | 5% | మినరల్ వాటర్ | 27% | 18% | సిమెంటు | 29% | 18% |

సిఎస్‌టి యొక్క ఖాతా ఆక్రామ్, ఎంట్రీ ట్యాక్సు ఇతరము (2% శాతం కంటే అధికము) కూడా చేర్చబడినట్లయితే జిఎస్‌టికు ముందు పన్ను ఇంకా ఎక్కువ ఉండును.

**జిఎస్‌టి - ఒక మంచి సులభ పన్ను**

ట్వీట్ చేయండి @askGST_GoI జిఎస్‌టి సంబంధిత ప్రశ్నలకు

జిఎస్‌టి రేట్లు జిఎస్‌టి రేట్లు ఫైండర్ లభించును App Store Google play

జిఎస్‌టి ధరలు యుఆర్ఎల్‌లో లభించును

కేంద్ర ఎక్సైజు మరియు సుంకముల మండలి & రాష్ట్రాలు / కేంద్ర పాలిత ప్రాంతాల కమర్షియల్ పన్నుల విభాగములు

www.cbec.gov.in, www.cbec-gst.gov.in

davp 15502/13/0232/1718

VIJAYABHANU - Vijayawada

Editor : Bete Sai Trilok, Printed and Published by Bete Chandra Sekhar on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from D.No:58-3-15/1A, Atchamma Street, Patamata, Vijayawada-520 010, A.P. and Printed at **VIJAYABHANU PRESS,** D.No.9-3-17, Pithapuram Colony, Visakhapatnam -530 003, RNI No.APTEL/2008/24468, ☆ e-mail: vijayabhanudaily@gmail.com